RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 24 సెప్టెంబర్ 2025 బుధవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:97

# ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులు.

**ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది.**
**పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు.**
**సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి.**







**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) సెప్టెంబర్ 23 :** ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.

మంగళవారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం కు హెలికాప్టర్ లో 12 గంటల 27 నిముషాలకు చేరుకున్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గార్లకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సి,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిరిసిల్ల రాజయ్య రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్, మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు సభ్యులు పోరిక బాలరాం నాయక్, డా. కడియం కావ్య , ఎమ్మెల్సీలు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్, పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

హెలిపాడ్ నుండి కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో ముఖ్య మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గిరిజన కొమ్ము కోయ నృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం గద్దెల వద్దకు సీఎం కు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించి, శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం మేడారంలో గిరిజన సంక్షేమ శాఖ, దేవాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలోరాష్ట్ర మంత్రులు, సీనియర్ అదికారులు, పూజారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు.

ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు సీఎం తెలుసుకున్నారు. ఆలయాన్ని విస్తరణ, అభివృద్ధిని ముక్తకంఠంతో పూజారులు, ఆదివాసీ సంఘాలు ఏకీభవించారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వందరోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించానాని, ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క సారలమ్మ ఆలయం ఉందనీ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశాం అని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయిన వారి జన్మ ధన్యమవుతుందనీ తెలిపారు.

ఇలాంటి అవకాశం ఈ జన్మకు దక్కిన వరం లాంటిది....ఆదాయం ఆశించి కాదు%౫% భక్తితో పనిచేయాలని సూచించారు. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేలా పనిచేయాలన్నారు. జంపన్న వాగులో నీటి నిల్వ ఉండేలా సాగునీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైనచోట చెక్ డ్యామ్ లు నిర్మించాలని, రాబోయే వంద రోజులు సమ్మక్క సారలమ్మ మాలధారణ చేసినట్లుగా నిష్ఠతో పనిచేయాలన్నారు. నిధులు గ్రీన్ చానల్ లో విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. పనులు పూర్తి చేయించుకునే బాధ్యత మీపై ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక డెడికేటెడ్ టీమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా జాతరకు విచ్చేయు భక్తులకు మరింత సౌకర్య వంతంగా ప్రభుత్వ పక్షాన కల్పించాలనే ధ్యేయంతో, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని సమ్మక్క సారమ్మల గద్దెలు ప్రాంగణ మరియు పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే, వారిని భాగస్వాములను చేస్తూ ఆలయ అభివృద్ధి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని, ఈ జాతర తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ తల్లులని, నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నాన ని, ఫిబ్రవరి 6, 2023 న ఈ గడ్డమీద నుంచే పాదయాత్ర మొదలుపెట్టా నని, సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని అన్నారు.

శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించి, శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం అని వివరించారు

సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలనే ఆలోచనతో మీ అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడికి వచ్చాం అన్నారు. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం అన్నారు. ఇది డబ్బులతో కొలిచేది కాదు.. నమ్మకంతో కొలిచేదని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలన్నారు.

మేడారం జాతర తెలంగాణ సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుందని, ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

మేడారంలో శ్రీ సమ్మక్క-సారలమ్మ గద్దెలు మరియు ప్రాంగణ పునరుద్ధరణ పనుల డీజన్లను విడుదల చేశారు.

కేంద్ర ప్రభుత్వం కుంభమేళాకు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్న నేపథ్యంలో మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించడానికి నిధులను కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరా ఆలోచన చేయాలని అన్నారు.

తెలంగాణ ప్రాంతంలో ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న సమ్మక్క సారలమ్మ ప్రాంగణం కూడా ఒక గొప్ప దేవాలయమని, ఈ జాతరకు ఎన్నో ఏళ్ల చరిత్ర పోరాట ప్రతిమ రాచరిక మీద తిరుగుబాటు జెండా ఎగరేసిన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆసియాలోని అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునరుద్ధరించడం కోసం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మన ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

గద్దెల పునరుద్ధరణ లో భాగంగా భక్తుల విశ్వాసం నమ్మకం ఆదివాసీల ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా , జాతర ప్రాశస్త్యం అనేక శతాబ్దాలు గుర్తిండి పోయేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. వనదేవతల ప్రాంగణాన్ని పూర్తిగా గ్రానైట్ రాయి తో నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

శ్రీ సమ్మక్క సారలమ్మ చరిత్ర 13వ శతాబ్దంలో మొదలైందని మరో వెయ్యి సంవత్సరాలు జాతర వైభోగం, ఆదివాసి సాంప్రదాయాలు , గుర్తుండేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.

గతంలో శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను అధికారికంగా నిర్వహించే అవకాశం ఇవ్వాలని కోరుకోవడం జరిగిందని అదే మాదిరిగా నా కోరికను తీరుస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగి జాతరను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరమే మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని స్వయంగా ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని అదే మాదిరిగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని వెంటనే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ ఆసీసుల ద్వారా సకల జనులు బాగుంటారని అన్నారు.

ప్రజా పాలన రావాలని ముఖ్యమంత్రి మేడారం ప్రాంతం నుంచి పాదయాత్ర ప్రారంభించడం జరిగిందని తల్లుల ఆశీర్వాదంతోనే ప్రజా పాలనకు శ్రీకారం చుట్టడం జరిగిందని అదే విధంగా మన ప్రియతమ ముఖ్యమంత్రి కి తల్లుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

వెయ్యేళ్ళ పాటు పటిష్టమైన రీతిలో ఉండేలా నిర్మాణం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

గద్దెల విస్తరణ విషయంలో అనేక అపోహలు ఉన్న నేపథ్యంలో నిర్మాణం ఏ విధంగా జరగాలని, ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడడం కోసం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి రావడం అనేది చాలా సంతోషంగా ఉందని తల్లుల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం వర్ధిల్లాలని అన్నారు.

అనంతరం మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాలకు ముఖ్యమంత్రి గారు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్కు బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, శాసన సభ్యులుడా. తెల్లం వెంకట రావు, బాలు నాయక్, కడియం శ్రీహరి, డా. మురళి నాయక్ , రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మా బొజ్జు, తెలంగాణ అటవి అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఏటూరు నాగారం ఎఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఈ ఓ వీరస్వామి, జిల్లా అధికారులు, పూజారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## కలెక్టరేట్ లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దంపతులు







**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్23 (ప్రజాబలం)** ఖమ్మం తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు మూడవ రోజు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లో వైద్య శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు బతుకమ్మ వేడుకలలో కలెక్టర్ సతీమణితో కలిసి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ వేడుకలలో కలెక్టరేట్లోని వివిధ శాఖలలో ఉన్న మహిళలంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మల ను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలోఅంటూ ఆట, పాటలతో సందడి చేసిన మహిళలు, ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ కలిసి ఆడి వారిని ఉత్తేజపరిచారు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారని అన్నారు ఈకార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు మరియు మహిళా ప్రాంగణం విద్యార్థినులు వైద్య శాఖ ఉద్యోగినులు, సిబ్బంది అందరూ పాల్గొని గౌరమ్మను కొలిచి ఆట పాటలతో సందడి చేసారు

ప్రజాబలం

24 సెప్టెంబర్ 2025 బుధవారం

# దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త

రాజారామన్న, (జనవరి 28, 1925) – సెప్టెంబర్ 24, 2004) భారత అణు శాస్త్రవేత్త. భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంచలన విజయాలు సాధించడంలో, అద్భుతమైన ప్రగతిని సాధించడంలో కీలకపాత్ర వహించిన వారిలో డాక్టర్ రాజారామన్న ఒకరు. భారత దేశం అణుబాంబును తయారు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. అణు శాస్త్ర మరియు సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధి చెందిన దేశంగా మన దేశానికి గుర్తింపు తేవడంలో రామన్న పాత్ర అద్వితీయం.కర్ణాటకలోని మైసూర్లో 1925 జనవరి 28నాడు జన్మించిన రాజా రామన్న ప్రాథమిక విద్యాభ్యాసం మైసూర్ లోనే చేశారు. తరువాత బెంగళూర్, మద్రాసు నగరాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి లండన్లోని కింగ్స్ కాలేజి నుండి మాలిక్యులర్ ఫిజిక్స్ లో పిహెచ్.డి. చేశారు. 1949లో టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ లో ప్రొఫెసర్ గా రామన్న తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అక్కడ సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు, డా.హోమీ జహంగీర్ భాభా సహచర్యం రాజారామన్నను ఎంతగానో ప్రభావితం చేసింది. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం నిర్మాణ బాధ్యతలను డా. హోమీ భాభా డా.రాజా రామన్నకు అప్పగించారు. వాటిని రామన్న సమర్ధవంతంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం హోమీ భాభా మరణం తరువాత అటామిక్ ఎనర్జీ కమీషన్ ఛైర్మన్ గా, అటామిక్ ఎనర్జీ డిపార్ట్ మెంట్ సెక్రటరీగా డా.రాజారామన్నను నియమించింది.1972 నుండి 1978 వరకు, మళ్ళీ 1981 నుండి 1983 వరకు బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్గా పనిచేశారు. 1978 నుండి 1981 వరకు, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు పదవిలో ఉన్నారు. ఇందిరా గాంధీ హయాంలో భారత దేశం 1974 మే 18 తేదీన జరిపిన అణు పరీక్ష అప్పట్లో ఒక సంచలనం. దాని వెనక రామన్న కృషి అసమానం. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశపు మొట్టమొదటి భూగర్భ అణు పేలుడులో రాజా రామన్న కీలక పాత్ర పోషించారు. అణు పేలుడు పరికరం తయారీకి వెళ్ళే వివిధ విభాగాలలో నైపుణ్యం ఉన్న అనేక బృందాలను ఆయన కలిసి తీసుకు వచ్చారు. రాజస్థాన్ ఎడారిలో పోఖ్రాన్ వద్ద జరిపిన ఈ అణు పరీక్ష ఫలితంగా అమెరికా, యూరోపియన్ దేశాలు ఇండియాపై ఆంక్షలు విధించాయి. ఇండియా పట్ల అణు అంటరాని తనాన్ని పాటించాయి. తాము ఒక పక్క అణ్వస్త్రాలను గుట్టలుగా పేర్చుకుంటూనే ఇండియాలాంటి మూడో ప్రపంచ దేశాలు అణ్వస్త్రాలు సమకూర్చు కోవడానికి వీలు లేదని శాసించాయి. భారత దేశ మొట్ట మొదటి అణు బాంబు నిర్మాణం దేశంలో కూడా రహస్యంగానే సాగింది. బాంబు రూపకల్పన, నిర్మాణం, పరీక్షలలో పాల్గొన్న 75 మంది శాస్త్రవేత్తలకు (బార్క్ అధిపతి రాజా రామన్న నాయకుడు) తప్ప భారత మంత్రులకు ఎవరికీ బాంబు నిర్మాణం అవుతున్న సంగతి తెలియదు. శాస్త్రవేత్తలు కాకుండా భారత ప్రధాని ఇందిరాగాంధి, ఆమె సలహాదారు మరియు అప్పటి మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి పి.ఎన్.హక్సర్, అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి డి.పి.ధర్ లకు తప్ప రక్షణ మంత్రికి కూడా బాంబు సంగతి తెలియదు. 1972 సెప్టెంబరులో బార్క్ సందర్శించిన ఇందిర నోటిమాటతో బాంబు నిర్మాణానికి, పరీక్షకు ఆదేశాలు ఇచ్చారని భావించ బడింది. 1997లో డాక్టర్ రాజా రామన్న స్వయంగా పోఖ్రాన్ లో పేల్చింది అణు బాంబే అని చెప్పేవరకూ అధికారికంగా దాని గురించి తెలియక పోవడం గమనార్హం. 1989 టాటాల ప్రోత్సాహం, ఫ్రాన్స్ నుండి ఆర్థిక సహకారం అందడం వలన డా. రాజారామన్న బెంగుళూర్ లో పరిశోధన సంస్థను స్థాపించారు. రామన్న చేసిన అసమాన కృషికి గుర్తింపుగా పద్మశ్రీ (1968), పద్మభూషణ్ (1973), పద్మ విభూషణ్ (1975) అవార్డులు రామన్నను వరించాయి. 2004, సెప్టెంబర్ 24 న మరణించారు.

# మ్యూటేషన్ల పనులు వేగవంతం చేయాలి

**సంతృప్తికరమైన సేవలు అందించండి**

**విధినిర్వహణలో అలసత్వంవహిస్తే ఉపేక్షించేది లేదు**

**జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్**



అల్లూరి జిల్లా పాడేరు, సెప్టెంబర్ 23: మ్యూటేషన్ల పనులు వేగవంతం చేయాలని, సంతృప్తికరమైన సేవలు అందించి, పిజిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, సబ్ కలెక్టర్లు, 22 మండలాల రెవెన్యూ అధికారులతో రేషన్ కార్డు సర్వీసెస్, రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, పిబిఎస్ఎల్ఎ సర్వీసెస్, ఎపి సేవాపోర్టల్, క్యాస్ట్ సుమోటో డ్రైవ్, రెవెన్యూ తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.నేటికీ పెండింగ్ లో ఉన్న మ్యూటేషన్ పనులపై మండలాలవారీగా రివ్యూ చేపట్టారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యూటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్లకు సంబందించి ప్రణాళికలు రూపొందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అలాగే రీసర్వే పురోగతిపై ఆరా తీశారు. ప్రణాళికలు వేసుకొని పనుల పురోగతికి చర్యలు చేపట్టాలన్నారు. అటవీ, రెవెన్యూ కి సంబంధించిన భూముల రీ రీసర్వే కోసం ఒక కమిటీ వేయాలన్నారు. అనంతరం పిజిఆర్ఎస్ నిర్వహణ కలెక్టర్ మాట్లాడుతూ లాప్సెస్ పై మండలాల వారీగా సమీక్షించి పనుల వేగవంతం చేయాలన్నారు. చౌకధర దుకాణల పరిశీలన కార్యక్రమం పై ఆరాతీశారు. అలాగే ఇంటి స్థలం కావాలని దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై ఆరాతీసి, నేటికీ ఇంటి స్థలం మంజూరు కాకపోవడానికి కారణాలపై, పనుల పురోగతిపై ఆసహనం వ్యక్తం చేశారు. నెల రోజుల్లోగా అర్హులను గుర్తించి ఇంటి స్థలం మంజూరు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పట్టాలు లేని వారికీ పట్టాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పనులు పురోగతి కావాలంటే అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఎపి సేవాపోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి ఫీడ్ బ్యాక్ కీలకమని, విధి నిర్వహణలో అలసత్వంవహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కారం అందించాలనే లక్షంతో విధులు నిర్వహించాలన్నారు. పౌర సర్ఫరాల పెండింగ్లో ఉన్న ధరఖాస్తులు పరిశీలనా కార్యక్రమం వేగవంతం చేయాలని, పెండింగ్లో వున్న ప్రతీ దరఖాస్తు గ్రామ స్థాయిలో పరిష్కారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు పై సమీక్షించారు. ప్రస్తుతానికి పెండింగ్ లో ఉన్న పిటిషన్ లు రానున్న వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో అన్ని పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ లను పరిష్కరించే విధానాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో ఆడిట్ చేయించి సమస్య పరిష్కారంలో ఏమైనా లోపాలు కనిపించినా, సరిగా పర్యవేక్షినీచకుండా గ్రీవెన్స్ ముగించినా, అర్జీదారునితో సంబంధిత గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ అధికారి మాట్లాడకపోయినా సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు. పిజిఆర్ఎన్, రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి తాహాశీల్దారులు చొరవ చూపించాలన్నారు. ప్రతీ వారం సమస్యలు పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బందితో రివ్యూ చేయాలని సూచించారు. మూడు డివిజన్లలోని సబ్ కలెక్టర్లు సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలన్నారు.ప్రభుత్వ శాఖలకు ఏవైనా భూములు అప్పగించినట్లయితే ఆ భూములు ప్రభుత్వ శాఖల అధీనంలో లేకుండా వేరే ఎవరి అన్యాక్రాంతం లో ఉన్నట్లు ఐతే గత మూడు సంవత్సరాలు కు సంబంధించిన హ్యాండ్ ఓవర్ చేసిన భూములు వివరాలు క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి నివేదికలు పంపించమని తహసీల్దార్లకు ఆదేశించడం జరిగింది.ఈ వీడియో కాన్ఫరెన్సులో డిఆర్ఓ కె. పద్మలత, ప్రత్యేక ఉప కలెక్టర్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఎం.వి.ఎస్ లోకేశ్వర రావు, వర్చువల్గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, 22 మండలాల తాహాశీల్దారులు, సర్వేయర్స్ మండల సర్వేర్లు, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# సుఫారి ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

**హత్య కేసును చేదించిన పోలీసులు**

**నిందితుల రిమాండ్, పరారీలో ఒకరు**

**హత్యకు వినియోగించిన కారు, మొబైల్ ఫోన్, కత్తి సీజ్**

**అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి**



**ప్రజా బలం దినపత్రిక ( సెప్టెంబర్ - 23 )వేములవాడ** పథకం ప్రకారమే రియల్ ఎస్టేట్ వ్యాపారి సిరిగిరి రమేష్ హత్య జరిగిందని, సుపారి తీసుకొని హత్య చేసిన ఇద్దరు నిందితులను పట్టుకోవడం జరిగిందని, మరొకరు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్, కత్తిని సీజ్ చేసుకున్నట్లు వేములవాడ అడిషనల్ ఎస్పి శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం చందుర్తిలో గల భూమిని ఎస్సి కార్పొరేషన్ లోన్ పై పెట్రోల్ బంక్ నిమిత్తం చిర్రం రవి అనే వ్యక్తి సిరిగిరి రమేష్ కు రిజిస్ట్రేషన్ చేశాడని, పెట్రోల్ బంక్ ఇవ్వకుండా, తిరిగి భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా, భూమిని ఇతరులకు అమ్ముదామని సిరిగిరి రమేష్ ప్రయత్నాలు చేయడంతో, విషయం తెలుసుకున్న చిర్రం రవి తన భూమి తనకు దక్కాలంటే సిరిగిరి రమేష్ ను హత్య చేయాలని, ఎద్దండి వెంకటేష్,వంశీ లకు సుపారి ఇచ్చి ఈ నెల 19న రాత్రి 8 గంటల సమయంలో పెద్దూరు సబ్ స్టేషన్ సమీపంలో కారు ఆపి, కారులో నిద్రిస్తున్న సిరిగిరి రమేష్ ను వంశీ కదలకుండా గట్టిగా కాళ్లు పట్టుకొని ఉండగా, చిర్రం రవి కారు వెనక సీట్లో కూర్చొని గట్టిగా పట్టుకోగా, డ్రైవర్ సీట్ లో కూర్చున్న ఏద్దండి వెంకటేశ్ కత్తితో సిరిగిరి రమేష్ గొంతులో, చాతిపై పలు మార్లు పొడిచి హత్య చేశారని, తర్వాత సిరిగిరి రమేష్ చనిపోయడని నిర్ధారించుకొని ఎద్దండి వెంకటేష్ శవాన్ని కారులో తీసుకువచ్చి వేములవాడ నంది కమాన్ సమీపంలో గల రమేష్ కు చెందిన నందీశ్వర టౌన్ షిప్ వెంచర్ లో కారు వదిలిపెట్టి పారిపోయారని, పోలీసు వారు వెతుకుతారనే భయంతో పారిపోతుండగా వేములవాడ లోని సాయి రక్షా దాబా సమీపంలో పోలీసులు ఏద్దండి వెంకటేష్, వంశీలను పట్టుకొని రిమాండ్ కు తరలించామని,ప్రస్తుతం చిర్రం రవి పరారీ లో ఉన్నాడని

# కులగణన లెక్కలు చెప్పండి



హైదరాబాద్, సెప్టెంబర్ 23 కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసే కుట్ర పన్నుతుందని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలోని కుల గణన సర్వే పూర్తి వివరాలు బయటపెట్టడం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉన్న చోట రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ప్రకటించే లోపే కులగణన సర్వే వివరాలు వెల్లడించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హడావిడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి రాజకీయ ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తే బీసీలకు అన్యాయం చేసినట్టే అని వ్యాఖ్యానించారు. గ్రామపంచాయతీల వారీగా కుల గణన వివరాలు వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం తెలంగాణ జాగృతి మొదటి నుంచి చిత్తశుద్ధితో పని చేస్తుందని, రిజర్వేషన్ల పెంపు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారుతెలంగాణ ప్రభుత్వం కొన్ని నెలల కిందటే కులగణన సర్వే వివరాలు వెల్లడించింది. ఏ కులం, మతానికి చెందిన వారు తెలంగాణలో ఎంత మంది ఉన్నారో లెక్కలు అసెంబ్లీ వేదికగా సైతం తెలిపింది. అయితే కుల గణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటుందని మాజీ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర చేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. కొన్ని రోజుల కిందట బీసీల రిజర్వేషన్లు పెంపు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దీక్ష చేశారు. తరచుగా బీసీ సంఘాల నేతలను కలిశారు. అన్ని పార్టీల నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం మద్దతు తెలపాలని కోరారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్ల ఏర్పాటు వివరాలు సమర్పించాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు గ్రామ సర్పంచ్ ఎన్నిలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలు సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. సంబంధిత అధికారులు రూపొందించిన జాబితా, వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు.

పూర్తి కావొస్తున్న హైకోర్టు ఇచ్చిన డెడ్ లైన్

జులై నెలలో హైకోర్టు సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి డెడ్ లైన్ ఇవ్వడం తెలిసిందే. మరో వారం రోజుల్లో సెప్టెంబర్ పూర్తి కావొస్తుంది. బీసీ రిజర్వేషన్లను తన రాజకీయ అంశంగా తీసుకుని పోరాటం చేస్తున్న కవిత తాజాగా తెలంగాణ ప్రభుత్వంపై కుట్ర ఆరోపణలు చేశారు. కులగణన సర్వే వివరాలు పూర్తిగా ప్రజలతో పంచుకోవాలని, గ్రామపంచాయతీల వారీగా కులగణన వివరాలను బహిర్గతం చేసి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రభుత్వం హడావుడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని కవిత అభిప్రాయపడ్డారు. బీసీల రిజర్వేషన్లు పెంపు కోసం తెలంగాణ జాగృతి పోరాటం ఆపదని కవిత స్పష్టం చేశారు.

# ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఓట్‌చోరీ నినాదం దేశవ్యాప్తంగా ఎంత చర్చగా మారిందనేది తెలిసిందే. తాజాగా మరోసారి ఆయన ఎన్నికల కమిషన్‌పై విమర్శలు గుప్పించారు. అయినప్పటికీ ఈసీ నుంచి సమాధానం రాలేదు.అసలు ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది? దీనిపై ఎవరూ ఏమీ మాట్లాకపోవడంతో, ఇది ప్రజలకేమీ సంబంధంలేని వ్యవహారంగా రాజకీయరంగు పులుముకొంటోంది. దొంగ ఓట్ల చేరిక మొదలు కొందరి ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించేస్తున్నారని రాహుల్ చెబుతుంటే దీనికి పూర్తి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఈసీకి ఉందా,లేదా?ఈ వ్యవహారంపై నిజం ఏమిటన్నది రాహుల్‌గాంధీ ప్రశ్నలకు కాకపోయినా దేశ ప్రజానికానికైనా జవాబు చెప్పాలి.ఎందుకంటే, ప్రభుత్వాలను ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకొనేలా ఎన్నికలు నిర్వహించేది ఈసీ. అలాంటి ఎన్నికలపై అనేక అనుమానాలు వస్తుంటే వాటికి ఈసీ వివరణ ఎంతో అవసరం. అదిచ్చే క్లారిటీతోనే తమ ఓటుతోనే ఎన్నికైన ప్రభుత్వం వచ్చిందన్న భరోసా ప్రజల్లో పెరుగుతుంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికి కొన్ని అనేకమార్లు వివిధ రాష్ట్రాల్లో ఈసీ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించింది. కేంద్రంలో ప్రభుత్వం కోసం ఎన్నికలు జరుగుతూ వస్తున్నాయి. ఇన్నిసార్లు ఎన్నికలు జరిగినా ఈసీ మీద ఈస్థాయిలో ఎవరూ ఆరోపణలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడ రాహుల్‌గాంధీ వేస్తున్న ప్రశ్నలు ఈసీ మూలాలనే ప్రశ్నిస్తున్నాయి, కమిషన్ ఉనికినే సవాల్ చేసేలా ఉన్నాయి. అయినా ఈసీ అంతపెద్దగా రియాక్ట్ కావడం లేదన్న చర్చ అయితే అంతటా నడుస్తోంది. ఈసీ అంటే సర్వ స్వతంత్ర సంస్థ. అంతేకాదు రాజ్యాంగబద్ధమైనది కూడా. అలాంటి సంస్థ మీద ప్రతిపక్షనేత ఇంత సీరియెస్ విమర్శలు చేస్తూ ఆధారాలతో సహా వెల్లడిస్తుంటే జవాబు చెపాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు లేదా అన్నదే ఇక్కడ ప్రశ్న. తీవ్రమైన చర్చ జరిగాక ఆగస్టు పదిహేడున ఒకసారి ఈసీ ప్రెస్‌మీట్ పెట్టి "రాహుల్ గాంధీ చేసిన విమర్శలు తప్పు. ఆయన దగ్గర ఆధారాలుంటే అఫిడవిట్ రూపంలో ఇవ్వాలి. లేదంటే క్షమాపణలు చెప్పాలి" అని ఎన్నికల ప్రధానాధికారి అన్నారు. ఆ తర్వాత ఈసీ తరఫున మళ్లీ ఎవరూ ప్రెస్ ముందుకు రాలేదు. ఇక దీనిపై ట్వీట్లతోనే ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు విపక్షాలకు ఉంటుంది. ఓట్‌చోరీ వ్యవహారంపై ఇప్పుడు రాహుల్‌గాంధీ సంధించే ప్రశ్నలు కూడా అదే కోణంలో చూడాలి. కానీ బీజేపీ అలా చూడకపోవడం బాధాకరం. ప్రజల్ని తప్పుతోవ పట్టించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నాడని, ఆయనకు రాజ్యాంగం మీద గౌరవం లేదని, చెప్పే మాటలు అర్థం లేనివని ఏవేవో వ్యాఖ్యానిస్తున్నది. ఎక్కడెక్కడ ఓట్లు చోరీకి గురయ్యాయో, ఎక్కడ తొలగించారో సాక్ష్యాలతో సహా వివరిస్తుంటే కల్లబొల్లి కబుర్లతో కాలయాపన చేస్తున్న బీజేపీని మాటలనే ప్రజలు విశ్వసించడం లేదని ఆ పార్టీ నాయకులు గ్రహించడం లేదు. ఓట్ చోరీ జరగలేదని బీజేపీ రుజువు చేయచ్చు కదా? దీనిపై ఎలా ముందుకెళ్లినా తమకే నష్టమన్న రీతిలో ఆ పార్టీ ఆలోచిస్తోందని అర్థమవుతోంది. పైగా బీహార్ ఎన్నికలు దగ్గర పడిన తరుణంలో దీన్నుంచి ఎలాగైనా గట్టెక్కాలనే ఆందోళనలో ఉంది. ఇలాంటి సందర్భంలో ఈసీ ఎందుకు మాట్లాడం లేదు? దీన్నిబట్టి చూస్తే రాహుల్ ఆరోపించినట్టుగా బీజేపీ- ఈసీ బంధం బాగా ధృఢంగా సాగుతోందన్నట్టే కదా. లేదంటే ఆరోపణలన్నింటికి సమాధానం చెప్పాలి. రాహుల్ చేసిన ఆరోపణలను సుమోటోగా స్వీకరించాలి, విచారణ చేపట్టాలి.ఆయన చేసిన ఆరోపణలు తప్పయితే చర్యలు తీసకునే అధికారం ఈసీకి ఉంది. మరి అలాంటప్పుడు జంకడం దేనికి? ఈసి, బీజేపీ కుమ్మక్కయిందని ఇట్టే అర్థమవుతోంది. కానీ,ఒక్క విషయం ఈసీ గుర్తెరగాలి. ఈ రోజు రాహుల్, రేపు మరొకరు ఎవరైనా ఇలాంటి ఆరోపణలు చేస్తే ఇదే తరహాలో ఖండించి ఊరుకుంటే ఈ దేశ ఓటర్ల మదిలో అనేక సందేహాలు గూడు కట్టుకుంటాయి. అలా జరగడానికి అవకాశమివ్వకూడదు. ఎన్నికలు వస్తాయి..పోతాయి, రాజకీయ పార్టీలు కూడా గెలుస్తాయి..ఓడుతాయి, కానీ ప్రజాస్వామ్యం నిలబడాలి. అది జరగాలంటే ఎన్నికల వ్యవస్థ బలంగా ఉండాలి, దానిపై అనుమానాలు, అపోహలు ఉండకూడదు, రాకూడదు. అలా జరగొద్దని ఈసీ భావించాలి. ఓట్ చోరీ.. ఓట్ల తొలగింపుపై ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ దేశానికి సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

# ఒడిదుడుకుల అమెరికా- భారత్ సంబంధాలు

## భారత్-అమెరికా సంబంధాలు ఎటు?

రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ యుక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందనే కుంటిసాకుతో, భారత్ అధిక సుంకాలు విధిస్తూ 'సుంకాల రారాజు'గా నిలిచిందని ఆరోపిస్తూ ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఈ విషయమైయమై బ్రెండెన్ ల్లించ్ నాయకత్వంలో క్రొత్త ఢిల్లీకి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి, భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి భారత బృందానికి మధ్య జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి కనిపించలేదు. అయితే భారత ప్రధాని నరేంద్రమోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయయడం, దృశ్య మాధ్యమాల ద్వారా చర్చలు కొనసాగించి రత్వరలోనే ఒక అంగీకారానికి రావాలని నిర్ణయించడమే ఓ సానుకూల పరిణామంగా భావిస్తున్నారు.భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలు, వివిధ రకాల వెన్నలు, పాలపొడి వంటి పాడి ఉత్పత్తులు ఎగుమతి చేయాలని, 146 కోట్ల అతి పెద్ద జనాభా గల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహ తహలాడుతోంది. అందుకు సరళమైన సుంకాల తో అనుమతి ఇవ్వాలని దశాబ్దాలుగా మన దేశంపై ఒత్తిడి తెస్తోంది. అయితే 86 శాతం చిన్న, సన్నకారు రైతులు, 8కోట్ల పాడిరైతుల జీవితాలపై దుష్ప్రభావము పడుతుందని భారత ప్రభుత్వం అందుకు అంగీకరించడంలేదు. అదీగాక పాల అధికోత్పత్తికి వాడే దాణాలో కలిపిన ఏంజైములుమ మాంస కృత్తులు అధికంగా ఉండటం, ఆరోగ్యానికి హానికరమని భావించడం, అవి భారత ఆచారాలు, సాంప్రపదాయలు,ఆహార అలవాట్లకు విరుద్ధంగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటికి అనుమతించడము లేదు.

దీంతో డాలర్ ప్రభువు ట్రంప్‌కు పట్టరాని ఆగ్రహము కిలిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి 50 శాతం సుంకాలు విధించడంతో, జౌళీ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, టోలు వస్తువులు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపద ఉత్పత్తిలో భాగస్వాములైన లక్షలాది మంది మహిళలు ఇతర శ్రామికుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం పడింది. పనులు, ఆదాయాలు కోల్పోయివారు వీధినపడి ఆక్రోషిస్తున్నారు. రొయ్యల ఎగుమతులలో 80 శాతం, చేపలు, సముద్రఉత్పత్తుల్లో 39 శాతం ఆంధ్రప్రదేశ్ నుండి జరుగుతున్నాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు వాటి ఎగుమసతులు ఆగిపోయి 25 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ,అంచనా. అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేత జాతి దురహంకారాన్ని రెచ్చగొట్టి రెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ ఇంటాబయటా పెట్రేగి పోతున్నాడు. భారత్‌పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించి భారత్ 64.3, దక్షిణ కొరియా 57 శాతం, టర్కీ అన్ని వస్తువులపై 17.3, భారత దేశం సగటున16.2 సుంకాలు విధిస్తున్నాయి. అమెరికాలో సేద్యంపై ఆధారపడి జీవిస్తున్న వారు 2శాతం, యూరోపియన్ దేశాలలో కేవలం 4శాతం కాగా, చైనాలో 22 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అమెరికాలో వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలను కంపెనీలు అత్యాధునిక యంత్రాలు, నూర్పిడి పరికరాలతో చేయడం వల్ల సాగు ఖర్చు తక్కువ. యూరోప్ చైనా తదితర దేశాలలో కూడా యంత్రాల వాడకము వల్ల సాగు ఖర్చు తక్కువ ఉత్పాదకత ఎక్కువ. 2024లో చైనా100 బిలియన్ డాలర్లు, అమెరికా 59 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. అమెరికా భారీగా మొక్కజొన్న, పత్తి వంటి 182.8 బిలియన్ డాలర్లవ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, చైనా అనుభవాలను భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలి. పంట సీజన్లో యూరియా తదితర ఎరువులను సరఫరా చేయలేనిస్థితి భారత ప్రభుత్వానిది.మన దిగుమతులలో మూడోవంతు వంటనూనెలే. వాటిపై 10 శాతం సుంకం. పత్తిపై సున్నా, పచ్చబఠానీల పై నామమాత్రంగా సుంకాలున్నాయి.అమెరికా కోడికాళ్లపై వాల్ నట్స్ పై 100శాతం, యాపిల్స్ పై 50శాతం, పాలపొడిపై50 శాతం సుంకాలు విధిస్తున్నారు. మనదేశం అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు.బియ్యం దదిగుమతిపై 70 శాతం ఉంది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది కనుక అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత ప్రభుత్వ లక్ష్యానికి చేరాలంటే వివిధ రంగాలలో ఎన్నో మార్పులు తేవాలి. అమెరికా సుంకాలు ఆదేశానికి కూడా నష్టం కలిగిస్తాయని,ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళనలు వక్తమవుతున్నాయి. ప్రధాని మోడీ 2019 సెప్టెంబర్ లో అమెరికాలో పర్యటించి హ్యూస్టన్ లో జరిగిన సభలో ట్రంప్‌తో కర చాలనం చేశారు.

ఇతర దేశాల ఆంతరంగిక రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదనే నియమాన్ని పక్కన పెట్టి 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ ట్రంప్ కు అనుకూ లంగా ప్రచారం చేశారు. అప్పుడు బిడెన్ గెలిచారు.

అయినా సుంకాల విషయంలో రెండోసారి అధ్యక్షుడైన ట్రంప్ కరకుగా వ్యవహరిం చడమే గాక అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలెన్నో తీసుకున్నారు. హెచ్1బి వీసాలపై ఎన్నో ఆంక్షలు విధించాడు. భారత్ అమెరికాలలో మితవాద ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా ఇప్పుడు ప్రధాని మోడీ దేశ ప్రయోజనాల కోసం గళం వినిపించక తప్పలేదు. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధకాలం నుండి భారత అమెరికా సంబంధాలలో ఎన్నో ఒడిదుడుకులు తప్పడం లేదు. అమెరికా పాకిస్తాన్ పాలకులను దువ్వుతూ ఆయుధ,ఆర్థిక సాయం అందిస్తూ వస్తోంది. 1971 లో ఎన్నికయిన షేక్ ముజిబుర్ రహమాన్ కు పాక్ సైనిక పాలకులుఅధికారం అప్పగించకిపోవడం,సైనిక దమన కాండతో ఆగ్రహించిన బంగ్లా ప్రజలు విముక్తి పోరాటాన్ని ప్రారంభించగా భారత్ నైతిక మద్దతు ఇచ్చి ఆయుధ సహాయం చేసింది. లక్షలాదిమంది శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడుగా ఉన్న రిచర్డ్ నిక్సన్ పాక్‌కు మద్దతుగా తమ సప్తమ నౌకా దళాన్ని పంపారు.

దీటుగా అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు మద్దతుగా నిలవడంతో వెనుదిరగక తప్పలేదు. అలా యెన్నో అవాంతరాలు, విభేదాలతో నడిచిన భారత అమెరికా సంబంధాలు 2000సం.లో అప్పటి అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటనకు రావడముతో కొత్త మలుపు తిరిగాయి. తర్వాత అధికారములోకి వచ్చిన భారత్‌మెరికా ప్రభుత్వాలు, నేతలు కూడా యధాశక్తి చేసిన కృషితో రెండు దేశాల సంబధాలు ఈ స్థాయికి వచ్చాయి. ఇటీవల భారత దళాలు పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసి ధ్వంసం చేసినపుడు తన జోక్యంతోనే భారత్ దాడులు ఆపిందని ట్రంప్ పదే పదే కోతలు కోయగా భారత్ ఖండించింది. ఏదేశంతో సంబంధాలైనా ,వాణి జ్యమైనా పరస్పర్రప్రయోజానాల ప్రాతిపదికగానే జరగాలి.ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కిలిగిస్తాయని ఆయుధ తదితరపరిశ్రమ వర్గాలు ఆందోళనవ వ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలునీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చు ననీ మినహాసయింపుఇవ్వడం కొంత ఊరట.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చ లు త్వరలో ఒక కొలిక్కి రాగలవని ఆశాభా వము వ్యక్తం అవుతోంది.

మోడీ తన మిత్రుడని, భారత్ గొప్ప దేశమని ట్రంప్ కొత్త రాగం వలపించగా,అమెరికా సహజ మిత్రదేశం అని మోడీ స్పందన. భారత్ తొలి నుండి స్వతంత్ర విదేశాంగ వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది.సోవియట్ కుప్పకూలాక ఏకధ్రువ ప్రపంచంగా కొన్నాళ్ళు అమెరికా కు తిరుగులేదని ఊదరగొట్టారు. చైనాలో పుతిన్,మోడీ,షి జిన్ పింగ్ లసమావేశం తర్వాత అమెరికా తత్తరరపడి కొంత తగ్గింది.

ప్రాచీన సంస్కృతి,నాగరికత గల భారత్ చైనాలు దగ్గరైతే ఉభయ తారకంగా వుంటుంది చైనాకు మన ఎగుమతులు పెంచాలి. ప్రస్తుతం దిగుమతులే ఎక్కువ. నాయకత్వం మన ప్రజల బహుళ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ధృఢంగా వ్యవరించినపుడే ,మన ఎగుమతులను వివిధ దేశాలకు విస్తరించినపుడే లక్ష లాదిమంది ఉద్యోగ ఉపా ధులను కాపాడగలం. భారత్ అన్ని రంగాలలో రానున్న కాలము లో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగ దానికి ఎంతో శ్రమించాల్సివుంది.

# ఎమ్మెల్యేలపై చర్యలు...

అమరావతి, సెప్టెంబర్ 23, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైసీపీ? 11మంది ఎమ్మెల్యేలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఆ పార్టీకి టెక్నికల్‌గా ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే? సభలో నాలుగు పార్టీలు ఉండగా? మూడు కూటమి మిత్రపక్షాలే. ఇక మిగిలి ఉంది మేమే కాబట్టి? మాకు ఆ హోదా కావాలన్నది వైసీపీ డిమాండ్. ప్రధాన ప్రతిపక్ష హోదా ఎలాపడితే అలా ఇచ్చేసేదికాదని, సభా నియమాల ప్రకారం నడుచుకుంటూ అందుకు తగ్గట్టు జనం ఇచ్చిన తీర్పును బట్టే ఇచ్చేదన్నది ప్రభుత్వ వాదన. ఈ విషయంలో వైసీపీ కోర్ట్‌కు వెళ్ళినా లక్ష్యం మాత్రం నేరవేరలేదు. తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఉండదు కాబట్టి మేం? అసెంబ్లీకి రాబోమంటూ? పట్టుదలగా ఉన్నారు మాజీ సీఎం జగన్. ఈ పరిస్థితుల్లో? వైసీపీ ఎమ్మెల్యేలకు కొత్త భయం పెరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే ప్రతీసారి వైసీపీ వాళ్లు సభకు రావాలి.. రాకుంటే చర్యలు తప్పవని అంటున్నారు స్పీకర్, డిప్యూటీ స్పీకర్. బడ్జెట్ సెషన్‌లో వైసీపీ సభ్యులు మమ అనిపించినా? టెక్నికల్‌గా అవి కౌంట్‌లోకి రాలేదు. దీంతో వరుసగా 60 రోజులు సభకు హాజరుకాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవచ్చని తాజాగా హాట్ కామెంట్స్ చేశారు ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు.ప్రస్తుతం సెషన్ నడుస్తున్న క్రమంలో? సభకు హాజరవకుంటే? అనర్హత వేటు వేస్తామని, మీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కూడా హెచ్చరించారు. ఇదే ఇప్పుడు పొలిటికల్ హాట్ అయ్యింది. తమ ఎమ్మెల్యేలపై చర్యల అంశంలో గతంలోనే స్పందించారు వైపీసీ అధ్యక్షుడు జగన్. వాళ్లకు బుద్ది పుట్టినట్టు చర్యలు తీసుకోమనండి? ఎవరు కాదన్నారంటూ రియాక్ట్ అయ్యారాయన. తాజాగా వైసీపీ ఎల్పీ సమావేశంలో కూడా ఇదే అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్ళు ఈ అంశాన్ని జగన్ ముందు ప్రస్తావించటంతో ఆయన కూడా గతంలో స్పందించిన తరహాలోనే చర్యలు తీసుకోనివ్వండి.. చూద్దాం అన్నట్టు తెలిసింది. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించటానికే కదా? మనం సమయం అడుగుతోంది. టెక్నికల్ రీజన్స్‌తో ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా కనీసం నిర్దిష్ట సమయం ఇస్తామని కూడా క్లారిటీగా చెప్పడం లేదు? 40 శాతం ఓట్లు వచ్చిన మనల్ని సాధారణ సభ్యులుగా పరిగణించి రెండు, మూడు నిమిషాల సమయం ఇస్తే సరిపోదు కదా.. అని జగన్ అన్నట్టు చెప్పుకుంటున్నారు. అదే సమయంలో? సభకు వెళ్ళని సభ్యుల మీద ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం కూడా సాధ్యం కాదనేది వైసీపీ వర్షన్. చర్యలు తీసుకోబోయే ముందు స్పీకర్ వైసీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలి. ఆ నోటీసులకు వాళ్ళు సమాధానం చెప్పాలి. ఆ సమాధానాలకు సంతృప్తి చెందక పోతేనే.. స్పీకర్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అయితే ఈ విషయంలో ఇప్పటికే వైసీపీ కోర్ట్‌కు వెళ్లి ఉండటం, స్పీకర్ యాక్షన్ తీసుకున్నా తిరిగి కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండటం లాంటి కారణాలతో సాగదీత ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అంతేతప్ప ఇప్పటికిప్పుడు యాక్షన్ తీసుకునే అవకాశం ఉండకపోవచ్చన్నది విశ్లేషకుల మాట. దీంతో ఒకరిద్దరు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మినహా మిగతా వారిలో దాని గురించి అంత టెన్షన్ లేనట్టు తెలుస్తోంది. ఒకవేళ సీరియస్ యాక్షన్ తీసుకున్నా? దానికి విరుగుడు మందును పార్టీ అధినేత జగన్ ఎలాగూ సిద్దం చేస్తారు కాబట్టి కంగారేం లేదన్నది సీనియర్ ఎమ్మెల్యేల అభిప్రాయం అట. సభకు హాజరవలేదని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్న దాఖలాలు దేశంలో ఎక్కడా లేవని గుర్తు చేస్తున్నారు పొలిటికల్ పండిట్స్. రాజకీయ సవాళ్ళకు, చట్టపరంగా తీసుకునే చర్యలకు చాలా తేడా ఉంటుందని భావిస్తున్నారు. అయితే? ఇవన్నీ తెలియకుండానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ కామెంట్స్ చేస్తారా అన్నది ఇంకో క్వశ్చన్. దీంతో గవర్నమెంట్ యాక్షన్, అందుకు వైసీపీ రియాక్షన్ ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

# రాజీనామాకు సిద్ధమౌతున్న మరో ఏడుగురు ఎమ్మెల్సీలు

విజయవాడ, సెప్టెంబర్ 23, ఏపీలో విచిత్ర రాజకీయ పరిస్థితుల కొనసాగుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూటమి టార్గెట్ చేస్తోంది. కూటమిని తట్టుకొని నిలబడాలని చూస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే పోరాడుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను వైసీపీ ఎమ్మెల్సీలు ఎండగడుతున్నారు. మండలి చైర్మన్గా వైసీపీ నేత ఉండడంతో గట్టిగానే ప్రశ్నిస్తున్నారు. మంత్రులు ధీటుగా బదిలిస్తున్నారు కానీ.. కూటమి ఎమ్మెల్సీ ల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదు. అందుకే ఇప్పుడు టిడిపి కూటమి శాసనమండలిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున వైసీపీ ఎమ్మెల్సీలను తమ వైపు తిప్పుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే ఏడాది కిందట వైసీపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు ఇప్పుడు కూటమి బాటపడుతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత దాదాపు ఆరుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. వారి రాజీనామాకు చైర్మన్ తెలపకపోవడంతో పొలిటికల్ జంక్షన్ లో నిలబడి పోయారు. అయితే ఇప్పుడు ప్రత్యేక వ్యూహంతో కూటమి ఆహ్వానించడంతో ఆ పార్టీలో చేరిపోయారు. అయితే మండలి పై పూర్తి పట్టు సాధించేందుకు చంద్రబాబు గట్టి ప్లాన్ వేసినట్లు సమాచారం.శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత ఉంది. 2027 నాటికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గి కూటమి బలం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మండలిలో 58 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం అధికారికంగా తెలుగుదేశం పార్టీకి 10, జనసేనకు ఒక ఎమ్మెల్సీ ఉన్నారు. అయితే మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఐదుగురు ఎమ్మెల్సీలు కూటమికి సొంతమయ్యారు. ప్రస్తుతం శాసనమండలిలో టిడిపి కూటమి బలం 16 మంది ఎమ్మెల్సీలు. మరో ఏడుగురు ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరారు. ఈ లెక్కన కూటమి బలం 23 కు చేరింది. ఇంకా చాలామంది ఎమ్మెల్సీలు టిడిపి కూటమి టచ్ లోనే ఉన్నారు. ఈ లెక్కన మరో ఏడుగురు ఎమ్మెల్సీలను తమ వైపు తిప్పుకుంటే.. మండలిలో కూటమికి చేజిక్కినట్టే. మొన్న ఆ మధ్యన విజయనగరం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్సీ టిడిపికి సహకరించారని అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. అయితే ఆయన కోర్టుకు వెళ్లి ఎమ్మెల్సీ పదవిని తిరిగి పొందారు. టిడిపికి మద్దతు గానే ఉన్నారు. అలాంటి చాలామంది ఎమ్మెల్సీలు ఉన్నారు.ప్రస్తుతం మండలి చైర్మన్ వద్ద ఏడుగురు వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామా లేఖలు ఉన్నాయి. అవి ఆమోదానికి నోచుకోవడం లేదు. దీంతో ఎమ్మెల్సీలు కోర్టుకు వెళ్లారు. వారి రాజీనామాల విషయంలో కోర్టు అనుకూల తీర్పు ఇస్తే.. మరో ఏడుగురితో సైతం రాజీనామా చేయించేందుకు కూటమి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. తద్వారా సభలో 30 మంది ఎమ్మెల్సీలతో చైర్మన్ మోసేన్ రాజు పై అవిశ్వాసానికి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయ మంగళం వెంకటరమణ కోర్టుకు ఆశ్రయించారు. దీంతో ఓ పదివేల రూపాయలు జరిమానా కట్టాలని శాసనమండలి కార్యాలయానికి ఆదేశించింది కోర్టు. ఈ కేసు విచారణకు గాను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని కోర్టు ఆ నిర్ణయానికి వచ్చింది. దీంతో రాజీనామాలు చేసిన ఎమ్మెల్సీల విషయంలో కోర్టు సానుకూల తీర్పు వస్తుందని భావిస్తున్నారు. కోర్టు తీర్పు ఆధారంగా శాసనమండలిలో వైసిపి భవితవ్యం ఆధారపడి ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ప్రజలకు 8 వేల కోట్లు మిగులు

నెల్లూరు, సెప్టెంబర్ 23, దేశంలో నూతన జీఎస్టీ విధానం ఈరోజు నుంచి అమల్లోకి వచ్చింది. సామాన్యులకు ఊరటనిచ్చేలా అనేక వస్తువులపై జీఎస్టిని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. చాలా రకాల వస్తువులను ఐదు శాతం జీఎస్టీ పరిధిలోకి రావడంతో వాటి ధర తగ్గనుంది. నూతన జీఎస్టీ విధానానికి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక బుక్ లెఫ్ట్ విడుదల చేశారు. ఇది పూర్తిగా తెలుగులోనే రూపొందించారు. మరోవైపు కొత్త జీఎస్టీ విధానం కారణంగా ఏపీ ప్రజలకు 8 వేల కోట్ల రూపాయల వరకు ప్రయోజనం అని ఏపీ వాణిజ్య పనుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు తెలిపారు.చాలా వస్తువులపై ప్రస్తుతం జీఎస్టీ 18% ఉంది. అది ఐదు శాతానికి తగ్గితే భారీగా ధరలు తగ్గుతాయని వాణిజ్య పనుల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా వెన్న, నెయ్యి,పన్నీరు, సబ్బులు, షాంపూ, హెయిర్ ఆయిల్, ప్రాసెస్డ్ ఫుడ్, బిస్కెట్లు, కాఫీ వంటి వాటిపై పన్ను తగ్గనుంది. ప్యాశ్చరైజ్డ్ పాలు, పన్నీరు, బ్రెడ్ వంటి వాటికి జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ వాటిపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించడంతో మధ్యతరగతి వారికి భారీ ఉపశమనం. స్వీట్లు,చాక్లెట్లు, ఐస్ క్రీమ్స్ మీద కూడా పన్ను ఐదు శాతానికి తగ్గనుంది. వ్యవసాయ రంగానికి సంబంధించి ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్ల పై జీఎస్టి 15% నుండి ఐదు శాతానికి తగ్గించారు.ఇక ఏపీలో ప్రత్యేకంగా జీఎస్టీ తగ్గింపుతో చాలా రంగాలకు ఉపయోగం ఉంది. ముఖ్యంగా చేనేత, హస్తకళలకు సంబంధించి జీఎస్టీ తగ్గింపుతో చాలా రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. మన రాష్ట్రంలో చేనేత రంగానికి సంబంధించి పొందూరు ఖాది, ధర్మవరం, పోచంపల్లి, మంగళగిరి చేనేత వృత్తుల వారికి.. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం అధికంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎగుమతులు పెరిగేందుకు అవకాశం లభించనుంది. సేవ రంగం, హోటల్ వసతులపై జీఎస్టి తగ్గింపు వల్ల.. హోటల్ చార్జీలు కూడా తగ్గుతాయి. ఫలితంగా విశాఖ లాంటి పర్యాటక నగరంలో సామాన్యుడికి సైతం షెల్టర్ దక్కి అవకాశం ఉంది. ప్రజారోగ్యానికి సంబంధించి మందులు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం లపై కూడా జీఎస్టీని తగ్గించడం మంచి నిర్ణయం. ఇది రాష్ట్రానికి ఎంతో మేలు జరిగేలా ఉందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు

# అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు...
# జగన్ తో విభేధిస్తున్న ఆ ఆరుగురు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 23, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పార్టీకి గుడ్ బై చెబుతారా? తమంతట తాము బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారా? లేకుంటే అధికార పార్టీ ప్రలోభ పెడుతోందా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం తాజాగా ఒక ప్రకటన చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్ళిపోయే అవకాశం లేదని తేల్చి చెప్పారు. చివరి వరకు తమ కుటుంబం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగుతుందని.. జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులమని చెప్పుకునే ప్రయత్నం చేశారు. అయితే ఉన్నపలంగా వైసీపీ ఎమ్మెల్యే ఇప్పుడు పార్టీ మారడం లేదని చెప్పడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు టిడిపిలో చేరడం కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏడాది పాటు ఎదురుచూసిన వారు ఇప్పుడు చేరుతుండడం ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో బిజెపిలోకి ఒక ఎమ్మెల్సీ వెళ్లడం కూడా చర్చకు దారితీస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చుట్టూ ఏదో జరుగుతోందన్న అనుమానం బలపడుతోంది.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో ఐదుగురు పార్టీలో సీనియర్లు. ఆపై జగన్మోహన్ రెడ్డి సొంత సామాజిక వర్గానికి చెందినవారు. మిగతా వారు మాత్రం కొత్తవారే. కూటమి ప్రభంజనాన్ని సైతం తట్టుకొని నిలబడ్డారు. అయితే వారు అసెంబ్లీకి వెళ్లి అధ్యక్షా అనాలని ఎక్కువ మందికి ఆలోచన ఉంటుంది. ఎందుకంటే ఎమ్మెల్యేగా గెలిచి సభలో అడుగుపెట్టడం అనేది ప్రతి ఒక్కరి కల. కానీ జగన్మోహన్ రెడ్డి రాజకీయ కోణంలో ఆలోచించి సభకు గైర్హాజరవుతున్నారు. అయితే వైసీపీకి తక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. అందులో ఎక్కువ మంది జగన్ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. దీంతో వారంతా అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.ఏపీలో అసెంబ్లీ సమావేశాలు ఈనెల 18న ప్రారంభం అయ్యాయి. అదే రోజు జగన్ పార్టీ ఎమ్మెల్యేలు తో సమావేశం అయ్యారు.

అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని తేల్చి చెప్పారు. సభకు హాజరైన మాట్లాడే అవకాశం ఇవ్వనందున.. మనం సభకు వెళ్లడం వృధా ప్రయాస అని చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు బాహాటంగానే వ్యాఖ్యానాలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. సభకు వెళితే బాగుంటుందన్న అభిప్రాయం వినిపించింది. అయితే సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సారథ్యంలో మీరు సభకు వెళ్ళొచ్చని జగన్ ఎమ్మెల్యేలతో అన్నట్లు కూడా టాక్ నడిచింది. కానీ అందుకు పెద్దిరెడ్డి విముఖత చూపడంతో అక్కడితో ఆ చర్చ ఆగిపోయింది. జగన్ తిరిగి బెంగళూరు వెళ్ళిపోయారు.ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పాడేరు వైద్య కళాశాల విషయంలో కూడా ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు ఆందోళన చేపట్టారు. అయితే పక్కనే ఉన్న అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం మాత్రం హాజరు కాలేదు. ఆపై సీఎం చంద్రబాబు సమక్షంలో వైసీపీ ఎమ్మెల్సీలు టిడిపిలో చేరారు.

దీంతో రాజకీయంగా కూటమి సరికొత్త ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డిని విభేదించి ఓ ఐదు, ఆరుగురు ఎమ్మెల్యేలు సభకు హాజరైతే ఇబ్బందుల్లో పెట్టవచ్చన్న ఆలోచనలో కూటమి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖంగా అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం పేరు వినిపిస్తోంది. ఆయనతో పాటు ఓ ఐదుగురిని సభకు రప్పించి.. ప్రజాక్షేత్రంలో జగన్మోహన్ రెడ్డిని పలుచన చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# క్రాస్ క్లోవర్ లీఫ్ కోసం 127 ఎకరాలు

విజయవాడ, సెప్టెంబర్ 23, ఆంధ్రప్రదేశ్‌లో బందరు పోర్టు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది! దీనికి అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారులను విస్తరించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా నేషనల్ హైవే 65, నేషనల్ హైవేలను కలుపుతూ ఒక ప్రత్యేక కూడలిని నిర్మించనున్నారు. దీనివల్ల పోర్టుకు సరుకులు చేరవేయడం సులభమవుతుంది అంటున్నారు. అంతేకాదు, తెలంగాణ నుంచి కూడా రవాణా మరింత సులువు కానుంది. ఈ ప్రాజెక్టుతో ప్రాంతీయ అభివృద్ధికి బాటలు పడనున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో మరో హైవే విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే బందరు పోర్టు త్వరలో అందుబాటులోకి రానుండటంతో.. ఆ హైవేను ఆరు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. అలాగే బందరు పోర్టుకు వెళ్లే రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. నేషనల్ హైవే-65, నేషనల్ హైవే-216 లను పోర్టుకు అనుసంధానం చేస్తారు. దీని కోసం 127 ఎకరాల భూమిని సేకరించనున్నారు.. భూసేకరణపై చర్చించేందుకు జిల్లా మోర్త్ అధికారులు ఢిల్లీ వెళ్లారు.మచిలీపట్నం దగ్గర నేషనల్ హైవే 65, నేషనల్ హైవే-216 రోడ్లు కలిసే చోట ఒక కూడలిని నిర్మించనున్నారు. దీని వల్ల పోర్టుకు వెళ్ళే వాహనాలకు ట్రాఫిక్ సమస్య ఉండదు. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తవుతుంది. ఈ కూడలి (క్రాస్ క్లోవర్ లీఫ్) త్వరగా పూర్తయితే అభివృద్ధికి మరింత ఉపయోగపడుతుంది. మచిలీపట్నం బైపాస్ వంతెన దగ్గర ఈ కూడలిని నాలుగు రింగులతో నిర్మిస్తారు. దీని వల్ల పోర్టుకు వచ్చే వాహనాలు నేరుగా వెళ్ళిపోవచ్చు. ఇతర వాహనాలతో కలిసే అవకాశం ఉండదు. దీని వలన ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. పోర్టు పూర్తయితే ఓడల రాకపోకలు పెరుగుతాయి.. ఈ సమయంలో కూడలి అందుబాటులోకి వస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.ఈ కూడలి (జంక్షన్) నిర్మాణం కోసం మూడు గ్రామాల పరిధిలో భూమిని సేకరించనున్నారు. మొత్తం 127 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఎస్ఎన్‌గొల్లపాలెంలో 94 ఎకరాలు, అరిసేపల్లిలో 27 ఎకరాలు, మాచవరంలో 5 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఈ మేరకు సర్వే నంబర్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. వాటిని మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (మోర్త్)కు పంపించారు. భూసేకరణ కోసం 3ఏ నోటిఫికేషన్‌ను మరో 15 రోజుల్లో ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.నేషనల్ హైవే 216 ను విస్తరిస్తే తెలంగాణకు బందరు పోర్టుతో సంబంధం ఏర్పడుతుంది. దీనివల్ల భద్రాచలం, ఖమ్మం నుండి గ్రానైట్ రాయిని పోర్టుకు ఈజీగా పంపవచ్చు. అమరావతి నాఖీఖీ దగ్గర నుంచే ఈ రహదారి వెళ్తుంది కాబట్టి రాజధానికి వెళ్లడం సులువు అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు కూడా ఉండవు. నూజివీడు మామిడి పండ్లు, మల్లవల్లి పరిశ్రమల ఉత్పత్తులను తేలికగా రవాణా చేయవచ్చు. ఇది తీర ప్రాంత రహదారి. దీనివల్ల ఆక్వా ఉత్పత్తులను పోర్టుకు ఎగుమతి, దిగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది. మొత్తం మీద బందరు పోర్ట్ నిర్మాణంతో హైవే విస్తరణతో పాటుగా అమరావతికి, హైదరాబాద్‌కు కనెక్టివిటీ మరింత పెరుగుతుంది అంటున్నారు. ఈ పనుల్ని త్వరలోనే ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు అధికారులు.

# ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్
# చామకూరి వెంకటనారాయణ



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని19వ డివిజన్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ ముగ్గు పోసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాషా నర్సిరెడ్డి భాస్కర్ బాల శివరాం శ్యామల రాజు వరికోటి భాస్కర్ విజయలక్ష్మి కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

# కాకినాడ ను వదలని రేషన్ మాఫియా

కాకినాడ, సెప్టెంబర్ 23, కాకినాడ అనగానే టక్కున గుర్తుకు వచ్చేది బీచ్ అనుకుంటారంతా... లేదా పోర్ట్ అనుకుంటారు.. కానీ రాజకీయ విమర్శలపరంగా వెంటనే గుర్తుకు వచ్చేది కాకినాడ పోర్ట్ కేంద్రంగా నడిచే అక్రమ పీడీఎస్ బియ్యం మాఫీయా గురించే. సంవత్సరాల కాలంగా వేళ్లూనుకుపోయిన ఈ మాఫియాను అడ్డుకట్ట వేయాలంటే కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటేనే తప్ప మరో మార్గం లేదన్న వాదను ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఎందకంటే గత వైసీపీ పాలనలో ఈ మాఫికా కార్యకలాపాలకు గేట్లు ఎత్తేశారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నేతలే టార్గెట్‌గా అప్పట్లో ఎన్నికల ప్రచారంలో కూడా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కీలక ఆరోపణలు చేస్తూ అధికారంలోకి రాగనే మీ తాట తీస్తామని హెచ్చరించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలల సమమం గడుస్తున్నా కాకినాడ పోర్టు కేంద్రంగా నడుస్తోన్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఏమాత్రం అడ్డుకట్టపడలేదన్నది పలువురి మాటగా వినిపిస్తోంది. తాజాగా ఇదే విషయాన్ని ఇటీవలే అమరావతి జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఏపీ డిప్యూటీ సీఎం సంధించిన పలు ప్రశ్నలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. కాకినాడ జిల్లా కలెక్టర్‌ను పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేశారు. ఇది రాజకీయంగా ప్రధాన్యత సంతరించుకుంది. కానీ పవన్ కళ్యాణ్ ప్రశ్నలకే పరిమితం అయ్యారా అన్న విమర్శలొస్తున్నాయి. ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచార సభల్లో కాకినాడ కేంద్రంగా జరుగుతోన్న అక్రమ బియ్యం రవాణా విషయంలో కీలకంగా వ్యాఖ్యానించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిని హెచ్చరించారు కూడా. అయితే కూటమి ప్రభుత్వం కోలువు తీరింది.. ఒకసారి ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేశారు. సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పలుసార్లు పోర్టులో తనిఖీలు చేసి కొంత సరుకును సీజ్‌కూడా చేయించారు. కానీ ప్రస్తుతం వినిపిస్తోన్న మాట కాకినాడ కేంద్రంగా సాగుతోన్న పీడీఎస్ అక్రమ రవాణా విషయంలో కూటమి ప్రభుత్వం ఏమాత్రం అడ్డుకట్టవేయలేకపోయిందన్న విమర్శలు వినిపిస్తోన్నాయి.. ఈ కారణమే ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో పవన్ కళ్యాణ్ ఈ ప్రశ్నలు సంధించారన్న ప్రచారం జరుగుతోంది. కూటమికి చెందిన నేతలు, అధికారులు, పీడీఎస్ అక్రమ రవాణా మాఫియాతో కలిసిపోయారని కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా ఎందుకు పెరిగింది? గత ఐదు సంవత్సరాల్లో కాకినాడ పోర్ట్ కేంద్రంగా పిడిఎస్ బియ్యం నమూనా పేరుతో ఎగుమతులు జరుగుతున్నాయి. రేషన్ డీలర్లు, మిల్లర్లు, స్మగ్లర్ల మధ్య నెట్‌వర్క్ ఏర్పడి రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరలో బియ్యం కొని, తిరిగి మిల్లింగ్ చేసి, పెద్దలకి అధిక ధరకు అమ్ముతున్నారని విచారణల్లో తేలితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? ప్రభుత్వ నేతలు, కొన్ని పోలీసు అధికారులు నుంచి కూడా మద్దతు ఉన్నట్లు ఆరోపణలు రావడం వెనుక వాస్తవం ఎంత.? 2024లో కాకినాడ పోర్ట్ ద్వారా సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నులపైగా బియ్యం ఎగుమతి అయినట్లు అధికార లెక్కలు చూపిస్తున్నాయి. ఇందులో అక్రమ పీడీఎస్ బియ్యం వాటా ఎంత.? ఇలా అనేక ప్రశ్నలు సామాన్యుల నుంచి వినిపిస్తున్నాయంటున్నారు.కాకినాడ పోర్టు కేంద్రంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై జరుగుతోన్న చర్చ అటుంచితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై దృష్టిసారించి చర్యలు ప్రారంభించారనే చెప్పవచ్చు. కాకినాడ పోర్టుపై నియంత్రణ, అక్రమ బియ్యం రవాణా నిరంతర నిఘా.. అధిక చెక్‌పాయింట్లు తనిఖీలు.. అధికారుల నిరంతర తనిఖీల ద్వారా బియ్యం సంబంధిత గోదాములు, లారీలు సీజ్ చేస్తోంది.. ఇటీవలే 85 కేసులు కాకినాడలో నమోదయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలో చూపిన ఉత్సాహం నీరుకారిపోయిందని, ప్రస్తుతం కాకినాడ పోర్టు కేంద్రంగా సాగుతున్న పీడీఎస్ బియ్యం అక్రమ ఎగుమతులు ఏమాత్రం తగ్గలేదని, కానీ పట్టించుకునే నాథులే కరవ-య్యారని మాత్రం దీనిపై పెదవి విరుస్తున్నారు..

# జాయింట్ వెంచర్ గా మెట్రోరైల్ ప్రాజెక్టు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 23, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెట్రో రైల్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ టెండర్లలో భాగస్వామ్యం కోసం జాయింట్ వెంచర్స్ (ఏఎ) కు అవకాశం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ప్రీ బిడ్డింగ్ మీటింగ్ కు హాజరైన కాంట్రాక్ట్ సంస్థల నుంచి వచ్చిన వినతితో ఈ నిర్ణయం తీసుకున్నారు. వీటిలో గరిష్టంగా 3 కంపెనీలు కలసి టెండర్‌ను వేయడానికి అనుమతించనున్నారు. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్పీ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు, ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తాయి. విశాఖ మెట్రో టెండర్లకు అక్టోబర్ 10, విజయవాడ మెట్రో టెండర్లకు అక్టోబర్ 14 వ తేదీ తుది గడువు విధించారు.ఇటీవల జరిగిన అధ్యయనాల ప్రకారం చిన్న చిన్న ప్యాకేజీలుగా విశాఖ, విజయవాడ మెట్రో రైలు పనులను విభజించడం వల్ల ప్రాజెక్ట్ నిర్మాణంలో ఆలస్యం జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరుగుతుంది. అందువల్ల, జాయింట్ వెంచర్స్ విధానానికి అవకాశం ఇచ్చారు. ఈ మెట్రో ప్రాజెక్టులను రికార్డు టైమ్‌లో పూర్తి చేయాలని లక్ష్యంగా, పనులను పెద్ద ప్యాకేజీలుగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.మెట్రో ఫేజ్-1లో విశాఖపట్నంలో 46.23 కిలోమీటర్లు, విజయవాడలో 38 కిలోమీటర్లు మెట్రో సివిల్ పనులకు అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు ఆహ్వానించారు. విశాఖపట్నం మెట్రో టెండర్ల దాఖలుకు అక్టోబర్ 10వ తేదీ, విజయవాడ టెండర్లకు అక్టోబర్ 14వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జాయింట్ వెంచర్ నిర్ణయాలతో ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.విజయవాడ, విశాఖల్లో మెట్రోలకు ఏపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నాయి. మొత్తం రూ.21,616 కోట్లతో విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు టెండర్లకు ఇటీవల అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా రూ.10,118 కోట్లతో విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు, రూ.11,498 కోట్లతో విశాఖ మెట్రో రైలుకు టెండర్లు ఆహ్వానించింది. ఈ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులను జాయింట్ వెంచర్స్ కు అవకాశం కల్పించింది. విశాఖ మెట్రోకు ఏపీ ప్రభుత్వ వాటాగా రూ.4,101 కోట్లు, సీఆర్డీఏ నుంచి విజయవాడ మెట్రోకు రూ. 3,497 కోట్లు ఇస్తారు. విశాఖ మెట్రోకు వీఎంఆర్డీఏ నుంచి నిధులు కేటాయిస్తారు. విజయవాడ మెట్రో రైలు పొడవు మొత్తం 66.15 కి.మీ, ఇందులో ఫేజ్-1 ప్రాజెక్టు 38.40 కిలోమీటర్లు, రెండు కారిడార్లుగా నిర్మించనున్నారు. గన్నవరం నుంచి పండిత్ నెహ్రూ బస్ స్టేషన్ వరకు 25.95 కి.మీ ఒక కారిడార్, నెహ్రూ బస్ స్టేషన్ నుంచి పెనమలూరు వరకు 12.45 కి.మీ రెండో కారిడార్ గా నిర్మించనున్నారు. ఫేజ్-1లో మొత్తం 34 స్టేషన్లు, అన్నీ ఎలివేటెడ్‌గా ఉండనున్నాయి. విజయవాడలో 66 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ మెట్రో రైలు ప్రాజెక్టు చేపడుతున్నారు. విశాఖపట్నం మెట్రో రైలు పొడవు 76.90 కిలోమీటర్లు. ఫేజ్-1 ప్రాజెక్టు 46.23 కిలోమీటర్లు. మొత్తం 3 కారిడార్లు ఉంటుంది. స్టీల్ ప్లాంట్ జంక్షన్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 29 స్టేషన్లు, 34.40 కి.మీ మొదటి కారిడార్, గురుద్వారా నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ వరకు 6 స్టేషన్లు 08 కి.మీ. రెండో కారిడార్. తాటిచెట్లపాలెం నుంచి చిన్న వాల్తేర్ వరకు 7 స్టేషన్లు 6.75 కి.మీ, మూడో కారిడార్ గా చేపడతారు. మొత్తం 99.75 ఎకరాల భూమి కావాలి. దీని ఖర్చు రూ.882 కోట్లుగా అంచనా. విశాఖలో 76.90 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ మెట్రో రైలు నిర్మించనున్నారు.

# చీరలు..బహుమతులు.. పుస్తకాలు
# పవన్ కు పిఠాపురం ప్రజలు ఫిదా



కాకినాడ, సెప్టెంబర 23, పిఠాపురం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తున్నారు. ప్రతి పండుగను ఒక వేడుకగా జరుపుకుంటున్నారు. తాజాగా దసరా ఉత్సవాలకు అమ్మవారికి చీరలు పంపించారు. పిఠాపురంలో పాదగయ క్షేత్రానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు అక్కడ ఘనంగా జరుగుతాయి. ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవార్లకు ప్రతిరోజు ప్రత్యేక అలంకరణలు కూడా చేస్తారు. పదో శక్తి పీఠమైన పూరుహితిక అమ్మవారికి కుంకుమార్చనలు కూడా చేస్తారు. అయితే దసరా శరన్నవరాత్రి వేడుకలకు గాను అమ్మవారిని అలంకరించేందుకు 22 చీరలను ప్రత్యేకంగా పంపారు. ఈ దేవీ నవరాత్రుల్లో ఒకరోజు పవన్ వచ్చి అమ్మవారిని దర్శించే అవకాశం ఉందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి.గతంలో పవన్ కళ్యాణ్ శ్రావణమాసం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో మహిళలకు 14 వేల చీరలను అందించారు. పవన్ వదిన, ఎమ్మెల్సీ నాగబాబు భార్య పద్మజ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అప్పట్లో పాదుగయ క్షేత్రంలో ఐదు బృందాలుగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. వేలాది మంది మహిళలు ఈ సామూహిక పూజల్లో పాల్గొన్నారు. వారికి నాగబాబు భార్య పద్మజ పవన్ కళ్యాణ్ సమకూర్చిన 14000 చీరలను అందించారు. అయితే ఏకంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ కోసం చీరలు పంపించడం పై మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.మరోవైపు పిఠాపురంలో రాఖీ పండుగ సందర్భంగా వితంతు మహిళలకు 1500 చీరలను పంపించారు పవన్ కళ్యాణ్. వివిధ కారణాలతో వైధవ్యం పొందిన మహిళలకు సోదరుడిగా అండగా నిలిచారు పవన్. సోదరుడిగా తాను ఉన్నానని భరోసా కల్పించేందుకు, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు పవన్ చీరలను అందజేశారు. జనసైనికులు ఇంటింటికి వెళ్లి ఈ చీరలను అప్పట్లో అందించారు. ఏపీ డిప్యూటీ సీఎం గా ఉంటూ పిఠాపురం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు పవన్ కళ్యాణ్. పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూనే.. ప్రతి వర్గానికి దగ్గర అయ్యేలా ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేగా తనకు ప్రతి నెల వచ్చే వేతనం నుంచి నియోజకవర్గంలో అనాథ పిల్లలకు ఒక్కొక్కరికి ఐదువేల చొప్పున అందిస్తున్న సంగతి తెలిసిందే. పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న అనాథ పిల్లలందరినీ దత్తత తీసుకున్నారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న పాదుగయాలో దసరా వేడుకలకు చీరలు పంపించి తన అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు పవన్ కళ్యాణ్.

## లక్కవరం లో భారీ దొంగతనం

## వృద్ధులపై దాడి చేసి కట్టేసి బెదిరింపు

## బంగారం ఎత్తుకుపోయిన దొంగలు.



జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం లో ఓ ఇంట్లో భారీగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. లక్కవరంలో నివాసముంటున్న వందనపు రూక్కయ్య లక్ష్మీ కుమారి నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి తెల్లవారుజామున దొంగలు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న భారీ ఎత్తులో అభరణాలు క్యాష్ బంగారు ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ చోరీపై లక్కవరం పోలీసులకు బాధితులు అర్ధరాత్రి ఫిర్యాదు చేయడం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్ లను పోలీసులు పరిశీలిస్తున్నారు.. విషయం తెలుసుకున్న వెంటనే జంగారెడ్డిగూడెం డిఎస్పి సర్కిల్ ఇన్స్పెక్టర్ తడికలపూడి ఎస్సై సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దొంగతనం చేయడానికి ముగ్గురు వ్యక్తులు వచ్చారని భయభ్రాంతులకు గురి చేశారని బాధితులు చెబుతున్నారు..

# బెంగళూరులో డిపాజిట్ భారం

బెంగళూరు, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్) భారతదేశ ఐటీ రాజధానిగా పేరొందిన బెంగళూరు, సిలికాన్ సిటీగా ఖ్యాతి గడించింది. ఇక్కడి ఇంటి అద్దెలు సామాన్యులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. జీతంలో అత్యధికంగా ఇంటి అద్దెకే చెల్లించాల్సి వస్తోంది. అడ్వాన్స్ డిపాజిట్ డిమాండ్‌లు జనసామాన్యాన్ని, ముఖ్యంగా ఐటీ ఉద్యోగులను కలవరపెడుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోందిఇటీవల రెడిట్‌లో ఓ వినియోగదారు బెంగళూరులోని పణత్తూరు ప్రాంతంలో ఒక ఫ్లాట్‌కు నెలకు రూ.70 వేల అద్దె, రూ.5 లక్షల డిపాజిట్ అడుగుతున్నారని పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ ఐటీ ఉద్యోగులు, స్థానికుల మధ్య భారీ చర్చకు దారితీసింది. ట్రాఫిక్ సమస్యలు, వర్షంతో నీటితో నిండిపోయే రోడ్ల మధ్య ఇంత భారీ అద్దె డిమాండ్ చేయడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరు 'ఇంత అద్దె భారం ఉంటే జీవనం ఎలా సాగించగలం?' అని ప్రశ్నించగా, మరొకరు చమత్కారంగా 'కార్యాలయానికి దగ్గరగా ఉంటే చిన్న గదికైనా భారీ అద్దె చెల్లిస్తారు, కానీ ట్రాఫిక్‌లో చిక్కుకుంటారు' అని వ్యాఖ్యానించారు. ఇక పణత్తూరులో సగటు అద్దె రూ.41 వేలు ఉండగా, రూ.70 వేల అని పేర్కొనడంపై స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు.

అద్దెల పెరుగుదలకు కారణాలు

బెంగళూరులో ఇంటి అద్దెలు గతంలో ముంబై, ఢిల్లీలతో పోలిస్తే సాపేక్షంగా తక్కువగా ఉండేవి. అయితే, కొవిడ్?19 మహమ్మారి తర్వాత పరిస్థితులు గణనీయంగా మారాయి. ఈ అద్దెల పెరుగుదలకు కొన్ని కీలక కారణాలు ఉన్నాయి.

? కోవిడ్ తర్వాత ఐటీ సంస్థలు కార్యాలయాలకు తిరిగి రావాలని ఉద్యోగులను కోరడంతో, బెంగళూరుకు తిరిగి వచ్చే ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఇది గృహాల డిమాండ్‌ను పెంచింది.

? ఇళ్ల నిర్మాణం తగ్గడంతో సరఫరా డిమాండ్‌కు సరిపడటం లేదు, ఫలితంగా అద్దెలు పెరిగాయి.

? రద్దీగా ఉండే రోడ్లు, ట్రాఫిక్ సమస్యల కారణంగా ఉద్యోగులు కార్యాలయాలకు సమీపంలో ఉండేందుకు ఎక్కువ అద్దెలు చెల్లించడానికి సిద్ధపడుతున్నారు.

? స్థానికుల అభిప్రాయం ప్రకారం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అద్దెలు పెరుగుతాయని, ఇది సహజమైన ఆర్థిక ఒడిదుడుకుల ఫలితమని చెబుతున్నారు.

మల్లేశ్వరం వంటి ప్రాంతాల్లో ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లకు రూ.లక్షకు పైగా అద్దె ఉండగా, 11 నెలల డిపాజిట్ వసూలు సాధారణమైంది. ఇంటిని ఖాళీ చేసేటప్పుడు రిపేర్, పెయింటింగ్ ఖర్చుల పేరుతో డిపాజిట్‌లోంచి ఒక నెల అద్దె మొత్తాన్ని కోతపెట్టడం సర్వసాధారణంగా మారింది. ఇది అద్దెదారులకు అదనపు ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. బెంగళూరు ఐటీ రాజధానిగా ఉండటం వల్ల ఆర్థిక అవకాశాలు ఎన్నో అందిస్తున్నప్పటికీ, ఇంటి అద్దెల భారం సామాన్యులకు, ఐటీ ఉద్యోగులకు సవాలుగా మారింది. సోషల్ మీడియా చర్చలు ఈ సమస్య యొక్క తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.

# కవిత మాస్టర్ మైండ్...



హైదరాబాద్, సెప్టెంబర్ 23, రాజకీయాలలో బంధాలకు, అనుబంధాలకు తావు ఉండదు. రాజకీయ నాయకులకు అధికారమే ముఖ్యం కాబట్టి.. దానికోసమే పాకులాడుతూ ఉంటారు. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తూ ఉంటారు. అవసరమైతే కుటుంబ సభ్యులను వదులుకోవడానికి వెనుకాడరు.. తరహా ఉదంతాలు మన దేశంలో ఎన్నో చోటుచేసుకున్నాయి. చోటు చేసుకుంటూనే ఉన్నాయి.. కాకపోతే జరుగుతున్న సంఘటనలు మాత్రమే మారుతున్నాయి. అంతిమంగా పరమార్థం మాత్రం ఒకటే.తెలంగాణ రాష్ట్రంలో గడచిన పది సంవత్సరాలు భారత రాష్ట్ర సమితి తిరుగులేని స్థానంలో ఉండేది. ప్రతిపక్షాన్ని చీల్చడం ద్వారా కేసిఆర్ తిరుగులేని నాయకుడిగా తెలంగాణలో స్థిరపడిపోయారు. తన వారసుడిగా కేటీఆర్ ను తెలంగాణ సమాజానికి పరిచయం చేశారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవహారాలు మొత్తం కేటీఆర్ చూసుకునేవారు. ఒకరకంగా అనధికారిక ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగే వారు. కేటీఆర్ స్థాయిలోనే ఉద్యమం చేసిన కవితకు చెప్పుకునే స్థాయిలో పదవులు దక్కలేదు. 2014లో పార్లమెంట్ సభ్యురాలిగా.. ఎన్నికయ్యారు. జాగృతి వ్యవస్థాపకరాలిగా కొనసాగే వారు. పార్టీలో కీలక వ్యవహారాలు సాగించే పదవి అనేది ఆమెకు ఉండేది కాదు. ఒక రకంగా పార్టీకి ఉన్న ఎంపీలలో ఆమె ఒక ఎంపీగా ఉండేవారు. చివరికి ఆమెకు పార్లమెంట్లో ఫ్లోర్ లీడర్ పదవి కూడా కేసీఆర్ ఇవ్వలేదు. ఇవన్నీ కూడా కవితకు ఇబ్బందిని కలిగించాయి. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత.. కవితకు కేసిఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కవిత ప్రాధాన్యం పార్టీలో మరింత తగ్గిపోయింది. ఇది ఇలాగే కొనసాగితే తనకు ఇబ్బందికరమని భావించిన ఆమె పార్టీపై వ్యతిరేక స్వరం వినిపించారు. ఇదే క్రమంలో పార్టీ అధిష్టానం ఆమెను సస్పెండ్ చేసింది.. ఈ నేపథ్యంలోనే కవితను మరింత ఇబ్బంది పెట్టాలని ప్రయత్నాలు జరిగాయి.ఈ ప్రయత్నాలను కవిత అత్యంత చాకచక్యంగా తిప్పి కొట్టారు. పార్టీ తనను సస్పెండ్ చేస్తే.. కవిత ఏకంగా పార్టీకి రాజీనామా చేయడంతో పాటు.. పార్టీ ద్వారా లభించిన ఎమ్మెల్సీ పదవికి కూడా ఆమె రాజీనామా చేశారు. రాజీనామా కూడా స్పీకర్ ఫార్మాట్ లోనే కవిత సమర్పించారు. ఆ తర్వాత శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఫోన్ కూడా చేశారు. కవిత రాజీనామా చేసిన సమయం ప్రకారం చూసుకుంటే ఈపాటికి మండలి చైర్మన్ ఆమోదం తెలిపి ఉండేవారు. కానీ ఆయన వేచి చూసే ధోరణి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం సుఖేందర్రెడ్డి కాంగ్రెస్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో ఆయన గులాబీ పార్టీలో ఉండేవారు.. సాధారణంగా స్పీకర్ ఫార్మాట్లో చేసిన రాజీనామాను వెంటనే ఆమోదిస్తారు. కానీ ఆయన పెండింగ్లో పెట్టారు. తద్వారా భారత రాష్ట్ర సమితికి షాక్ ఇచ్చే పరిణామాన్ని అమలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కవిత జాగృతి చీలిపోయింది. జాగృతిని కేటీఆర్ విజయవంతంగా చీల్చారని వినికిడి. ఎమ్మెల్సీ పదవి కూడా పోతే కవిత మరింత ఒంటరి అవుతుందని చర్చ కూడా జరిగింది. అయితే కవిత వ్యూహాత్మకంగా తన పదవి ఇప్పుడప్పుడే రద్దు కాకుండా ఉండడానికి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. తద్వారా తన సోదరుడికి షాక్ ఇచ్చారనే విశ్లేషణలు నడుస్తున్నాయి.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన టిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి సెప్టెంబర్ 23 సంగారెడ్డి పట్టణం లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల చేసిన తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి 109 మంది లబ్ధిదారులకు 55 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నియోజకవర్గం లోని ప్రజలకు ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి,బ్లాక్ ప్రెసిడెంట్ రఘుగౌడ్, కంది మండల అదేక్షులు మోతి లాల్,సదాశివపేట మండల అదేక్షులు సిద్దన్న, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్,వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

## -నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం

విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల కట్టలేనిది. సమాజంలో ఉన్నవారిని చైతన్యపర్చడంతో పాటు, సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేసినట్లవుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు.జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్ ) భారత ప్రభుత్వం చేత 1969 సంవత్సరం ప్రారంభించబడిన యువజన కార్యక్రమం.ఈ పథకాన్ని ప్రారంభించి నేటికీ 57 సంవత్సరాలు. ఇక దీని చరిత్రలోకి పోతే డా. డి.ఎస్. కొఠారి (1964-66) నేతృత్వంలోని విద్యా కమిషన్, విద్య అన్ని దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సి సి) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అని పిలువబడే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని వారు సిఫార్సు చేశారు. 1969 సంవత్సరంలో సెప్టెంబరులో జరిగిన వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ ఈ సిఫారసు ప్రకారంగా,సమస్యను వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో, పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా 'జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం,సహకారాన్ని అడిగిగారు.విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలుపంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం తెలియని నిర్మల మనస్కులు వీరు. వీరు కూడా సంఘజీవులే, సంఘంలో భాగస్వాములే, కాబట్టి సంఘసేవ (సోషల్ సర్వీస్) వాళ్ళకి బాధ్యత ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి.ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి- లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ.విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే అవకాశాన్ని కల్పించడం ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవను ప్రోత్సహించేందుకు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం రెండు భాగాలుగా విభజించబడింది: సాధారణ కార్యకలాపాలు మరియు ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు. సాధారణ కార్యకలాపాలలో వారంవారీ సమావేశాలు, సమాజ సేవ, సామాజిక సేవా ప్రాజెక్ట్‌లు ఉంటాయి. ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు సాధారణంగా 7 రోజుల పాటు నిర్వహించబడతాయి, ఈ సమయంలో విద్యార్థులు శుభ్రపరచడం, మొక్కల పెంపకం మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల వంటి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కళాశాలను పరిశుభ్రంగా వుంచటం- తోటలు పెంచటం- రోడ్లు వెయ్యటం. పరిసర గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామంలో రోడ్లు వేయటం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకి విద్య బోధించడం. ఆరోగ్య సూత్రాలను, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియజేయడం. వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమదాలలోనూ సహాయం చేయడం. ధనవంతుల నుండి విరాళాలు సేకరించి బీదవారికి, అనాథలకు సహాయపడటం. పొదుపు ఆవశ్యకతను, అంటు వ్యాధుల వల్ల వచ్చే అరిష్టాలను అరికట్టే విధానాలను ప్రచారం చేయడం దీని ముఖ్య లక్షణం.

## తెలంగాణలో కాంగ్రెస్ కష్టకాలమే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్ తెలంగాణలో ఉప ఎన్నికలు రాబోతున్నాయా.. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే ఏ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుంది?.. అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుందా.. ప్రతిపక్ష పార్టీ తన స్థానాలను నిలుపుకుంటుదా.. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం లభించింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నుంచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అయితే ఈ వ్యవహారంపై గులాబీ పార్టీ ఏకంగా సుప్రీంకోర్టు దాకా వెళ్లడం.. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించడం.. స్పీకర్ కు నోటీసులు ఇవ్వడం.. వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో స్పీకర్ ఆ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. ఫలితంగా వారంతా కూడా కాంగ్రెస్ పార్టీలో చేరలేదని స్పీకర్ కు సమాధానం చెప్పారు. అయితే ఆ పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. వారి స్థానాలలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని స్పష్టం చేస్తోంది. ఎలాగూ ఆ పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారు కాబట్టి ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని మరి కొంతమంది అంటున్నారు.ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే ఆ 10 స్థానాలలో ఎవరు గెలుస్తారు అనే విషయం ఆసక్తికరంగా మారింది. ఇటీవల జూబ్లీహిల్స్ శాసనసభ సభ్యుడు మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో కన్నుమూసిన నేపథ్యంలో.. ఆ స్థానానికి ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది. ఆ ఎన్నికలో గులాబీ పార్టీ నుంచి గోపీనాథ్ సతీమణిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్ కు టికెట్ ఖరారు అయిందని తెలుస్తోంది. బిజెపి నుంచి ఎవరు పోటీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ తోపాటు ఆ పది నియోజకవర్గాలలో ఎన్నికలు జరిగితే జగిత్యాల, గద్వాల స్థానాలలో మాత్రమే కాంగ్రెస్ గెలుస్తుందని ఓ సర్వే లో తేలింది. ఓ ప్రైవేట్ న్యూస్ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ సర్వే కు సంబంధించిన విషయాలు వెల్లడయ్యాయి.వాస్తవానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఉప ఎన్నికలు జరిగితే కాంగ్రెస్, గులాబీ పార్టీల మధ్య హో రాహోరీగా పోరు జరుగుతుందని తెలుస్తోంది. ఆ పోరులో గులాబీ పార్టీకి కాస్త అడ్వాంటేజ్ ఉంటుందని తెలుస్తోంది. మాగంటి గోపీనాథ్ కు ఉన్న చరిష్మా ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీకి తోడ్పడుతుందని సమాచారం. అయితే గతంలో ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున నవీన్ యాదవ్ పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలుస్తానని.. ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగు పెడతానని నవీన్ యాదవ్ చెబుతున్నారు. నవీన్ యాదవ్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రంగంలోకి దిగారు. అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ పదవిని కేటాయించి.. నవీన్ యాదవ్ కు లైన్ క్లియర్ చేశారు. తద్వారా జూబ్లీహిల్స్ లో పోటీకి సిద్ధమని సంకేతాలు ఇచ్చారు. ఎన్నికలు అన్నాక అనేక సర్వేలు బయటికి వస్తాయి. ఎవరికి తోచింది వారు చెబుతుంటారు. ఈ సర్వేలు నిజం కావాలని లేదు. అలాగని అబద్ధం అవుతాయని కూడా లేదు. అంతిమంగా ప్రజలు మాత్రమే ఎన్నికల్లో విజేతలను నిర్ణయించగలరు.

## జీఎస్టీ సంస్కరణలు.. వేడుకల తొలిరోజు 80వేల కార్ల విక్రయాలు

న్యూ డిల్లీ సెప్టెంబర్ 23 కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు అమలులోకి తీసుకువచ్చింది. నవరాత్రి (ఈ నెల 22న) వేడుకల తొలిరోజున అమలులోకి రాగా.. ఆటో మొబైల్ రంగానికి భారీగా ఊతమిచ్చాయి. ఓ వైపు జీఎస్టీ సంస్కరణలు.. మరో వైపు నవరాత్రి వేడుకల ప్రారంభంతో దేశంలోని అన్ని కార్ల షోరూమ్‌లు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి. వినియోగదారుల రద్దీ పెరగడంతో పలు కంపెనీలు సోమవారం రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపాయి. కేంద్రం జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా చిన్న కార్లు, ఎస్‌యూవీలపై 28 నుంచి 18శాతానికి జీఎస్టీ తగ్గించిన విషయం తెలిసిందే. ఇది కొనుగోలుదారులను ఆకర్షించింది. భారత్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సోమవారం మాత్రమే 80వేల కంటే ఎక్కువగా ఎక్వైరీస్ రాగా.. దాదాపు 30వేల వాహనాలను డెలివరీ చేసింది. ఇక హ్యూందాయ్ సైతం 11వేల యూనిట్లు విక్రయించింది. కంపెనీలు జీఎస్టీ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందిస్తుండడంతో వినియోగదారులు కార్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.మారుతి, హ్యూందాయ్ తదితర అనేక కంపెనీలు జీఎస్టీ తగ్గింపునకు తోడు అదనంగా డిస్కౌంట్స్‌ను ఇస్తున్నాయి. మారుతి వాహనాలపై రూ.1.29లక్షల వరకు భారీ డిస్కౌంట్స్ ఇస్తున్నది. మారుతి ఎస్-ప్రెస్సో కారు ధర రూ.1.29 లక్షలు తగ్గించి ప్రస్తుతం రూ.3.50 లక్షల ప్రారంభ ధరకు అమ్ముతున్నారు. మహీంద్రా బొలెరో, బొలెరో నియో రూ.2.56 లక్షల వరకు తగ్గాయి. టాటా పంచ్, కియా సైరోస్ కూడా రూ.1.6 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది. ఈ పండుగ సీజన్ ఆటోమొబైల్ కంపెనీలకు కీలక సమయం. ఎందుకంటే ఇది వారి వార్షిక అమ్మకాలు ఈ సమయంలో గణనీయంగా ఉంటాయి. గత కొన్ని నెలలుగా భారత ప్రయాణీకుల వాహన పరిశ్రమ బలహీనమైన అమ్మకాలతో ఇబ్బంది పడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు దాదాపుగా స్థిరంగా ఉన్నాయి. సంవత్సరం వారీగా వృద్ధి మొదట్లో 1-4శాతం ఉంటుందని అంచనా వేసింది. అయితే, జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో ఈ వృద్ధి రేటు 5నుంచి7శాతానికి చేరుకుంటుందని అంచనా. ఎస్అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ కూడా 2026కి భారతదేశంలో ప్రయాణీకుల వాహన పరిశ్రమకు దాని వృద్ధి అంచనాను 4.1శాతం నుంచి 8.5శాతానికి పెంచింది. ఆటోమొబైల్ రంగం త్వరలో మాంద్యం నుంచి బయటపడే అవకాశం ఉందని అంచనా వేసింది.

# జీఎస్టీ సవరణతో అమెరికాకు చెక్

జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో కోట్ల మంది భారతీయుల రోజువారీ ఆర్థిక భారం కొంత తగ్గనుంది.నిత్యావసరాలైన పాలు, బ్రెడ్ వంటి వాటితోపాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రాణాధార ఔషధాలు లాంటి వాటిపై పన్నును పూర్తిగా తొలగించారు.

చిన్న కార్లు, టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్ల మీద పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. ఇతర సాధారణ వస్తువులైన హెయిర్ ఆయిల్, సబ్బు, షాంపూ వంటి వాటిపై 12 లేదా 18 శాతానికి బదులుగా 5 శాతం పన్ను మాత్రమే ఉంటుంది.వస్తు సేవల పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల ప్రారంభంలో ప్రకటించారు.దీని వల్ల పన్నుల విధానం సరళీకృతంగా మారుతుందని...ఇంటి ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు.విజయ దశమి పండుగ సందర్భంగా ప్రజలు కొత్త కార్లు, దుస్తులు కొనుగోలు చేస్తారు. ఇలాంటి సమయంలో జీఎస్టీ రేట్లు తగ్గించడం పండగ సీజన్‌లో కొత్త వస్తువుల కొనుగోలుకు ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.పన్ను తగ్గింపు వల్ల వినియోగ వస్తువులైన ప్యాకేజ్డ్ ఫుడ్, దుస్తుల అమ్మకాలు ఈ నాలుగు నెలల్లో పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.అమెరికా విధించిన 50శాతం సుంకాల ప్రభావాన్ని జీఎస్టీ సవరణ తగ్గించవచ్చు.ప్రజలకు డబ్బు మిగలడం వల్ల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబులను మార్చడం ద్వారా రాయితీలు, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించడం, తాజాగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ కోతలు కొనుగోళ్లు పెరగడానికి సానుకూలంగా ఉన్నాయి.

రిలయన్స్, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి సంస్థలు పన్నుల తగ్గింపు లాభాన్ని వినియోగదారులకు అందించడం ద్వారా అమ్మకాల్ని పెంచుకుంటున్నాయి.ఆగస్టులో ప్రధాని మోదీ ప్రకటన తర్వాత కార్ల తయారీ సంస్థలు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో కార్ల కంపెనీల షేర్లు 6-17 శాతం పెరిగాయి.జీఎస్టీ సవరణల తర్వాత కార్ల గురించి అడిగే వారి సంఖ్య పెరిగిందని డీలర్లు చెబుతున్నారు.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు 30 నుంచి 40శాతం పెరుగుతాయని భావిస్తున్నట్లు ముంబయిలోని హీరో మోటోకార్ప్ షోరూమ్ డీలర్ ఒకరు చెప్పారు.''ధరలు తగ్గడంతో తొలిసారి బైక్ కొంటున్న వారి నుంచి ఎంక్వైరీలు ఎక్కువగా వస్తున్నాయి'' అని హీరో మోటోకార్ప్ సంస్థ ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అశుతోష్ వర్మ వివరించారు.ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి "తక్కువ ధర మోడళ్ల" విషయంలోనే ఉండేదని ఆయన అన్నారు.తాను ఈ ఏడాది 200సీసీ బైక్ కొనాలని భావిస్తున్నట్లు విశాల్ పవార్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెప్పారు.''పండుగ డిస్కౌంట్లు, పన్నుల కోత వల్ల ఏదైనా కొనడానికి ఇదే మంచి సమయం. ఈ దసరా పండగ సందర్భంగా నేను బైక్ కొంటున్నాను'' అని ఆయన అన్నారు.ఇకపై తమ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరుగుతాయని వినియోగ వస్తువుల తయారీ సంస్థలు కూడా ఆశాభావంతో ఉన్నాయి.పన్ను తగ్గింపుతో పాటు దేశావ్యాప్తంగా ఈ ఏడాది పంటలు బాగా పండటంతో ఎయిర్ కండీషనర్ల వంటి వస్తువుల మార్కెట్ మెట్రో నగరాలను దాటి విస్తరిస్తుందని భావిస్తున్నట్లు గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సవ్యసాచి గుప్తా చెప్పారు.అయితే జీఎస్టీ తగ్గించడం వల్ల గోద్రెజ్ లాంటి కంపెనీలు డిమాండ్ ఏ మేరకు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ధరల తగ్గింపుకు సంబంధించిన లేబుల్స్ ముద్రించడంలో బిజీగా మారాయి.మేం పాత, కొత్త ధరలను పక్క పక్కనే ముద్రిస్తున్నాం. దాని వల్ల వినియోగదారుడికి ధర ఎంత తగ్గిందో తెలుస్తుంది'' అని సవ్యసాచి గుప్తా బీబీసీకి చెప్పారు.చిన్న బ్రాండ్లు, దుకాణదారులు తగ్గిన పన్నులకు అనుగుణంగా ధరల్ని సవరించే పని పూర్తి స్థాయిలో చేపట్టలేదు.వారి వద్ద తగినంత సమయం, వర్కర్లు లేకపోవడంతో తగ్గిన ధరలతో ప్యాకింగ్ చేయడం కష్టంగా మారింది.

ముంబయిలోని ప్రఖ్యాత క్రాఫోర్డ్ మార్కెట్ నగరంలో అతి పెద్ద హోల్‌సేల్ రిటైల్ మార్కెట్.ఇక్కడ సుగంధ ద్రవ్యాల నుంచి గుండీల వరకు అన్నీ అమ్ముతారు.జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల గురించి ఈ మార్కెట్‌లో కొద్ది మంది దుకాణదారులకు మాత్రమే అవగాహన ఉంది.అవగాహన ఉన్న వారిలోనూ అయోమయం కనిపిస్తోంది.

తాను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన వస్తువుల ధరల్ని సవరించిన శ్లాబులకు అనుకుణంగా ఎలా మార్చాలనే దాని గురించి సరఫరాదారులతో చర్చిస్తున్నట్లు టపాసుల దుకాణం నిర్వహిస్తున్న షేక్ రెహమాన్ చెప్పారు.ఆయన దుకాణానికి పక్కనే ఉన్న బ్రైడల్ షోరూమ్‌లో నిరాశ కనిపిస్తోంది.ప్రభుత్వం రెండున్నర వేల రూపాయల కంటే తక్కువ ఉన్న దుస్తులపై జీఎస్టీ తగ్గించింది. అంత కంటే ఎక్కువ ధర ఉన్న దుస్తులపై జీఎస్టీ 18శాతంగా ఉంది.పెళ్లికి ధరించే దుస్తుల ధరలు రెండున్నర వేల రూపాయల కంటే ఎక్కువే ఉంటాయి. దీంతో నరేష్‌కు చెందిన బ్రైడల్ షోరూమ్‌లో దుస్తులు కొంటే 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.దీని ప్రభావం సరఫరా వ్యవస్థలతో పాటు డిజైనర్లు, చేనేత కళాకారులు, రిటైలర్లు, కస్టమర్లపై పడుతుంది.''భారతీయులు పెళ్లికి ధరించే దుస్తుల మీద భారీగా ఖర్చు పెడతారు. పెళ్లిళ్ల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. అయితే పన్నుల పెరుగుదల వల్ల ఈ ఏడాది కొనుగోళ్లు కాస్త మందగించవచ్చు'' అని నరేష్ చెప్పారు

అయితే జీఎస్టీ తగ్గింపు ప్రభావం విస్తృత స్థాయిలో సానుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.''జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజల నెలవారీ ఖర్చులో మూడోవంతు ప్రయోజనం కలుగుతుంది. దీని వల్ల వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'' అని క్రిసిల్ రేటింగ్ ఏజెన్సీ చెబుతోంది.జీఎస్టీ సవరణ ప్రభావం "తయారీ సంస్థలు ధరల తగ్గింపును ఏ మేరకు వినియోగదారులకు అందిస్తాయి" అనే దానిపై ఉంటుందని రేటింగ్ ఏజన్సీ క్రిసిల్ ఒక నివేదికలో తెలిపింది.

దీని ప్రభావం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంపైనా ఉంటుందని అంచనా వేసింది.వస్తు సేవల పన్ను శ్లాబుల్లో మార్పుల వల్ల ఏడాదికి వేల కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతామని ప్రభుత్వం అంచనా వేసింది.

అయితే మూడీస్ లాంటి రేటింగ్ ఏజన్సీస్ మాత్రం ప్రభుత్వ అంచనాల కంటే ఎక్కువే ఉండవచ్చని భావిస్తున్నాయి. రానున్న సంవత్సరాల్లో ఖజానాపై భారం ఇంకా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నాయి.గతేడాది 20శాతం పెరుగుదలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ పన్ను వసూళ్లు స్వల్పంగా పెరిగాయి. అయితే ఖర్చుల పెరుగుదల 20 శాతం కంటే ఎక్కువగా ఉందిఆర్థిక లోటు నియంత్రణ, ఆదాయ వ్యయాల మధ్య అంతరం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల నిర్మాణంలో వేగానికి రానున్న రోజుల్లో బ్రేకులు వేయాల్సి రావచ్చు.

## వానలతో రైతులు అతలాకుతలం

అదిలాబాద్, సెప్టెంబర్ 23, ఎపుడైనా అకస్మాత్తుగా ప్రమాదం జరిగితే ఆర్థిక అండ కోసం బీమా సౌకర్యం తప్పని సరిగా ఉండాలంటారు. అందుకే భీమా లేనిదే జీవితానికి ధీమా లేదు. అలాం టి ధీమా మనుషులకే కాదు.. పంటలకు అత్యవసరంగా మారింది. ప్రస్తుత కాలంలో ఎప్పుడు అతివృష్టి ఏర్పడుతుందో.. ఎన్న దూ అనావృష్టి కనిపిస్తుందో తెలియని పరిస్థితి. ఈ సమయంలో ఏదేని కారణంతో పం టలు నష్టపోతే భీమా సౌకర్యం ఉంటే ఆర్థిక సాయం అందుతుందనే ధీమా రైతుల్లో ఉం టుంది. గత కొన్నేళ్ల నుంచి రైతులకు ఇలాంటి సౌకర్యం లేకపోవడంతో ఆర్థిక సాయం రాక అన్నదాతలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఆపత్కాలంలో ప్రభుత్వాలు ఆడపదడపా సాయం అందిస్తున్నా.. జరిగిన నష్టం అధికంగా ఉండటం.. సర్కారు సాయం తక్కువ అందించడం వంటి పరిస్థితుల్లో అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల నుంచి ఇన్సూరెన్స్ కంపెనీలకు తమ వాటా కింద డబ్బులు చెల్లించకపోవడంతో పంటలు నష్టపోయిన సందర్భంలో రైతులకు పరిహారం రాలేని పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో ఇది వరకు రైతులకు వాతవరణ ఆధారిత భీమా (ఫసల్ బీమా )అమలయ్యేది. 2016 ఏప్రిల్ లో ప్రారంభమైన ఈ పథకం మొదలైంది. రైతులు వేసే పంటలకు సంబంధించి వాతావరణం ఆధారిత భీమా కోసం బ్యాంకుల ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు డబ్బులు చెల్లించేవారు. వీటికి తోడుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా కూడా చెల్లించేవి. దీంతో అధిక వర్షాలు, లేదంటే వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా పంటల వారీగా సర్వే చేయించి పంట నష్టం వివరాలు పంపించేవారు. ఇన్సూరెన్స్ కంపెనీలు నష్ట పరిహారం అందించేవి.కానీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో రైతుబంధు, రైతుభీమా వంటి పథకాలు అమలు చేస్తున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఫసల్ భీమా పథకం లో చేరలేదు. 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా చెల్లించడం నిలిపివేయడంతో ఈ ఫసల్ భీమా సౌకర్యం కూడా ఆగిపోయింది. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఏటా అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోతున్నా పరిహారం దక్కని పరిస్థితి తలెత్తుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది సుమారు 15 లక్షల ఎకరాల్లో పత్తి, సోయా, వరి, కందులు, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 18,600 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. కుము రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోనూ దాదాపు ఇలాంటి పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫసల్ భీమా సౌకర్యం అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో పాటు రైతుల వాటాను సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు. అధికారంలోకి రావ డంతో పాటు మంత్రులు సైతం ఇందుకు రూ. 1,500 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. కానీ అధికారం లోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర దాటినా ఫసల్ భీమాపై నిర్ణయం తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకమైన పంటల భీమా పథకం తీసుకొస్తామని సైతం ప్రకటించింది. కానీ అమలు చేయడంలో మాత్రం జాప్యం జరగడంతో ప్రకృతి ప్రకోపాలకు బలవుతున్న అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంటలకు భీమా సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## ఆదేశాలు సరే... ఆచరణకు దారేదీ...

వరంగల్, సెప్టెంబర్ 23, సర్పంచుల పదవీకాలం ముగిసిపోవడంతో పంచాయితీల నిర్వహణ భారాన్ని నెత్తికెత్తుకున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం దసరా పండుగ నిర్వహిం చడం ఎలా అనే అయోమయంలో పడ్డారు. రెండు సంవత్సరాలుగా పంచాయతీల నిర్వహణ బాధ్యతలను చేపట్టిన పంచా యతీ కార్యదర్శులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఇప్పటికే జేబు నుంచి చెల్లింపులు చేస్తూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్లు, మైనర్ రిపేర్లు చేయిస్తున్నారు. ఈ క్రమంలో దసరా పండుగ నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు గుది బండగా మారింది.దాదాపు 13 నెలలకు పైగా పంచాయతీల నిర్వహణ బిల్లుల చెల్లింపు నిలిపివేయడంతో, కొంతకాలం ఫర్మ్‌ల ద్వారా ఎలక్ట్రికల్ సామాగ్రి, పైప్ లైన్లకు సామాగ్రి, ఇతర సామాగ్రి తెచ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అయితే ఇప్పుడు ఫర్మ్ యజమా నులు కూడా పంచాయతీలకు సామాగ్రి ఉద్దెరగా ఇవ్వడానికి నిరాకరిస్తున్నారుదీనితో గత కొంతకాలంగా తప్పనిసరి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు తమ వేతనాల్లో నుంచి కొంత గ్రామ ప్రజల ఇబ్బందుల తీర్చడానికి వినియోగిస్తుండగా, ఇంకొంతమంది బయట అప్పులు తెచ్చి గ్రామాల్లో పైప్ లైన్ల మరమ్మత్తులు, వీధిలైట్లు, ఇతర చిన్న చిన్న మరమ్మత్తులు చేయించారు. అది కూడా ఇప్పుడు మరింత భారం కావడంతో ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ బయటకు చెప్పుకోలేక లోపల దాచుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 482 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఒక్కో పంచాయతీకి తక్కువలో తక్కువ లక్ష రూపాయల నుండి నాలుగు లక్షల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు చెబుతున్నారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 5 కోట్ల వరకు పంచాయతీ కార్యదర్శులకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. ఇటీవల ముత్యాలమ్మ బోనాల పండుగ ప్రతి గ్రామంలో నిర్వహించగా అప్పుడు కూడా అప్పు తెచ్చి నిర్వహించామని, ఇప్పుడు అప్పు కూడా అప్పుడు పుట్టని పరిస్థితి నెలకొందని వాపోతున్నారుప్రతిరోజు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ట్రాక్టర్ల డీజిల్ ఖర్చులు కూడా చెల్లించే పరిస్థితి లేకుండ పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచులు బాధ్యతగా తీసుకొని ఘనంగా దసరా పండగ నిర్వహించే పరిస్థితి ఉండగా, పంచాయతీ కార్యదర్శులు ఆ స్థాయిలో నిర్వహించలేకపోతున్నట్లు చెబుతున్నారు. నిత్యం తాగునీరు, పారిశుధ్య నిర్వ హణ, వీధిలైట్లు, చిన్న చిన్న మరమ్మతులకు చేతి నుండి డబ్బులు పెట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవడం వల్ల దసరా పండగ నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు గుదిబండగా మారింది. ఇప్పటికే చేతి నుండి కొంత, అప్పు తెచ్చి మరికొంత పెట్టుబడి పెట్టి గ్రామాల్లో నిర్వహణ భారాన్ని తలకు మించినప్పటికీ మోస్తున్నామని ఇప్పుడు దసరా పండుగ నిర్వహిం చడం తమకు గగనంగా మారిందని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారుగ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించడంతోపాటు దసరా పండుగ ఘనంగా నిర్వహించడానికి అవసరమైన లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారు.

చేతిలో చిల్లి గవ్వ లేకుండా దసరా పండుగ ఘనంగా ఎలా చేయాలో తెలియక పంచాయతీ కార్యదర్శులు అయోమయం చెందుతున్నారు.కనీసం గ్రామంలో వీధిలైట్లు వేసే పరిస్థితి లేదని, ఫర్మ్ షాపుల నుండి ఉద్దెర సామాగ్రి ఇవ్వడం లేదని, దసరా పండుగకి కనీసం వీధి దీపాలు లేకపోతే ఎలా అని లో లోపల మదన పడుతు న్నారు.ఈ క్రమంలో దసరా పండుగ నిర్వహించడం తలకు మించిన భారంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలకు దసరా పండుగ నిర్మాణ కోసం నిధుల విషయంపై ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా , ఈ అంశంపై నోరు విప్పడానికి వారు సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా అంతట ఇదే పరిస్థితి నెలకొంది. వర్దన్నపేట నియోజకవర్గంలో గత ఏడాది దసరా పండుగ నిర్వహించిన ఖర్చుల బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదని, ఈసారి దసరా పండగ ఆర్థిక సమస్యల వల్ల తాము నిర్వహించలేమని, ప్రత్యామ్నాయ పరిష్కారం చూపాలంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజుకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు.

## ఊరిస్తున్న పదవులు...ఇంకెన్నాళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 23,: ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులు, కాంగ్రెస్ పార్టీ పదవులు ఆశావహులను ఊరిస్తూనే ఉన్నాయి. త్వరలోనే పదవుల పంపకం అంటూ అటు ప్రభుత్వం, ఇటు పార్టీ అధిష్ఠాన పెద్దలు ప్రకటనచేయడం. ఆ తర్వాత మరచిపోవడం పరిపాటిగా మారిందని ఆశావహులు తీవ్రంగా నిరుత్సాహపడు తున్నారు. పదేళ్లుగా పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటం చేయడం.. అధికారంలోకి వచ్చాక నాయకుల చుట్టూ తిరగడం, కలిసిన వారికల్లా దండాలు పెట్టి అలసిపోయే స్థితికి వచ్చామని ఆవేదన చెందుతున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు పూర్తి కావస్తుంది. గతేడాది మార్చి నెలలో మొదటి విడతలో ఒకేసారి 37 మందిని కార్పొరేషన్ చైర్మన్లుగా రెండేళ్ల పదవీ కాలానికి నియమించారు. తర్వాత రైతు, విద్యా, బీసీ, మహిళా కమిషన్ తదితర పోస్టులను కూడా భర్తీ చేశారు. ఇంకా రాష్ట్ర స్థాయిలో 30 నుంచి 40 వరకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లతో పాటు జిల్లాల పరిధిలో కూడా చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.ఇంకా భర్తీ చేయాల్సిన కార్పొరేషన్లలో ప్రధానంగా సివిల్ సప్లయ్, ఆర్టీసీ, మూసీ రివర్ ఫ్రంట్, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బేవరేజెస్, గొర్లు, మేకల పెంపకం దారుల కార్పొరేషన్, టీజీఐడీసీ, హెచ్‌ఎండీఏ, హౌసింగ్ బోర్డు, గ్రామీ ణ నీటి సరఫరా, పట్టణాభివృద్ధితో పాటు కులవృత్తుల కార్పొరేషన్లు, గీత, రజక, వడ్డెర, పద్మశాలి, గొల్ల కురుమ, మాదిగ, మాల, రెడ్డి, బ్రాహ్మణ, మున్నూరు కాపు, లంబాడ, ఆదివాసీలతో పాటు ఇతర బీసీ కులాలు, ఎంబీసీ, వివిధ కులాల ఫెడరేషన్లకు చైర్మన్లు, సభ్యులను నియమించాల్సి ఉంది.వీటితో పాటు జిల్లాల స్థాయిలో గ్రాంథాలయం, బాలల హక్కుల కమిషన్ లాంటి పదవులు కూడా ఖాళీగానే ఉన్నాయి. అయితే, మొదటి విడతలో భర్తీ చేసిన చైర్మన్ల పదవీ కాలం ఏడాదిన్నర కావస్తుంది. మరో ఆరు నెలల్లో కొందరి పదవీ కాలం ముగుస్తుంది. ప్రభు త్వం ఏర్పడిన మొదట్లోనే అన్ని పోస్టులను భర్తీ చేసుంటే రెండో విడతలో అదనంగా వందలాది మందికి అవకాశం కల్పించడానికి వీలుండేదన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది. త్వరలోనే ఎస్సీ కమిషన్ పదవీ కాలం కూడా పూర్తి కావస్తోంది.ఇక పార్టీ పదవుల భర్తీలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం జరిగి ఏడాది పూర్తయింది. అయినా, పీసీసీ కార్యవర్గం మాత్రం పూర్తిగా నియమించుకోలేని పరిస్థితి. అంతే కాకుండా జిల్లా కాంగ్రెస్, మండల, బ్లాక్ కమిటీలను కూడా కొత్తవారిని నియమించాల్సి ఉంది. పార్టీ పదవులు ఆశించే వారి సంఖ్య భారీగానే ఉంది. కాగా, మూడు నెలల క్రితం 27మందిని టీ పీసీసీ ఉపాధ్యక్షులుగా, 69 మందిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా పార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే.ఇంకా పీసీసీ అధికార ప్రతినిధులు, పీసీసీ కార్యదర్శులు, ఆర్గనైజర్, ప్రచార కార్యదర్శులు, పార్టీ కార్యవర్గ సభ్యులతో పార్టీ అనుబంధ సంఘాలకు రాష్ట్ర కమిటీలు, జిల్లా స్థాయి లో నియమించాల్సి ఉంది. వీటితో పాటు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్, ప్రచార కమిటీ చైర్మన్ పోస్టుల్లో కొత్త వారికి అవకాశం ఉంటుందని చర్చ జరుగుతోంది. వర్కింగ్ పోస్టుల కోసం ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు సీనియర్లు పోటీ పడుతున్నారు. దీంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుల భర్తీ మరింత ఆలస్యమవుతోందని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే వేలాది మందికి పోటీ చేసే అవకాశం వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ పాలక వర్గాలు ఖాళీగానే ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే 12 వేల మందికి పైగా సర్పంచ్‌లు, ఇక వార్డుల సభ్యులుగా దాదాపు లక్షకు మందికి పైగా పోటీ చేసే అవకాశం కల్పించవచ్చనే చర్చ జరుగుతోంది.ఇక వేల సంఖ్యలో ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్స్, వందల సంఖ్య లో జెడ్పీటీసీలుగా పోటీ చేసే అవకాశం వస్తుంది. పార్టీ పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయడం వల్ల వచ్చే అన్ని ఎన్నికలకు పార్టీ కేడర్ ఉత్సాహంగా పని చేయడానికి ఆస్కారం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, పదవుల పంపకం విషయంలో అటు ప్రభుత్వం, ఇటు పార్టీ పరంగా ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

### ఈ యేడాది దుర్గమ్మ భక్తులకు తప్పని తిప్పలు

విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ ఆంక్షలతో అసౌకర్యం కలుగుతోందని భక్తుల ఆవేదన. సాధారణ ట్రాఫిక్ ఉన్నా అసాధారణ ఆంక్షలు విధించారు. కంట్రోల్ రూమ్ ఫ్లైఓవర్ వైపు నుంచి ద్విచక్ర వాహనాలను సైతం పోలీసులు నిలిపి వేస్తున్నారు. మరో వైపు కుమ్మరిపాలెం నుంచి సైతం ద్విచక్ర వాహనాల రాకపోకలనే నియంత్రిస్తున్నారు. దాంతో అమ్మవారి దర్శనాల పైనా ఆంక్షల ప్రభావం పడింది.

## ఐఏఎస్ అధికారుల్లో నిర్లిప్తత..

## ఎదురు తిరుగుతున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23, రేవంత్ ముఖ్యమంత్రి అయిన తొలి రోజులవి. కాళేశ్వరం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై శ్వేత పత్రాలు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్న రోజులు కూడా అదే. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆదేశించినప్పటికీ కొన్ని కీలక ఫైల్స్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కూడా చెప్పుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి అడిగిన అనేక సందర్భాలలోనూ అధికారులు ఇదే ధోరణి ప్రదర్శించారు. తట్టుకోలేక ముఖ్యమంత్రి వారికి స్థానచలనం కలిగించారు. వారంతా గులాబీ పార్టీకి అనుకూలమైన వ్యక్తులని.. అందువల్లే ఎవరి మాటా వినరని సెక్రటేరియట్ లో ప్రచారం జరుగుతుంటుంది. తాజాగా ఓ మంత్రికి ఐఏఎస్ అధికారి నుంచి దారుణమైన సమాధానం ఎదురయింది. ఒక రకంగా ఆయన పరువు కూడా పోయింది. ఇంతకీ ఏం జరిగిందంటే..తెలంగాణలో మలి దశ మంత్రివర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి లభించింది. ఆయన మంత్రి కావడం ఇదే తొలిసారి. సహజంగానే ఆయన ఉత్సాహంగా పనిచేస్తుంటారు. ఇటీవల కాలంలో తన శాఖకు సంబంధించిన కొన్ని ఫైల్స్ తన పేషి లో పనిచేస్తున్న సెక్రటరీకి పంపించారు. వాస్తవానికి వాటిపై వెంటనే సంతకాలు చేసి పంపించాల్సిన బాధ్యత సెక్రటరీ మీద ఉంటుంది. కానీ ఆ సెక్రెటరీ సీనియర్ ఐఏఎస్ అధికారి. పైగా గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ పెద్దలతో ఆయన విపరీతంగా అంట కాగారు.. దీంతో అదే ధోరణి ఇప్పుడు కూడా సాగిస్తున్నారు.. రేవంత్ ప్రభుత్వం ఆ అధికారి పై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకుంటుందనే నమ్మకం కూడా లేదు. ఇక ఐఏఎస్ అధికారి కొత్త మంత్రి పంపించిన ఫైల్స్ మీద సంతకాలు పెట్టకపోగా.. సాక్షాత్తు మంత్రి ఫోన్ చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు."ఏ దస్త్రం ఎప్పుడు పూర్తి చేయాలో నాకు తెలుసు. మీరు అనుక్షణం నా పనికి ఇబ్బంది కలిగించదు. ఎప్పుడు పడితే మీరు అప్పుడు ఫోన్ చేస్తే కుదరదని" మంత్రికి చెప్పడంతో.. ఆయన ఒక్కసారిగా షాక్ అయ్యారని తెలుస్తోంది. తన అనుచరులు.. కార్యకర్తల ముందు అలా మాట్లాడటంతో ఆ మంత్రి తలదించుకున్నారని తెలుస్తోంది. వాస్తవానికి మంత్రులు చెప్పిన పని అధికారులు చేయాలి. ఫైల్స్ మీద ఎప్పటికప్పుడు సంతకాలు పెట్టాలి. ఒకవేళ అందులో ఏవైనా లోపాలు ఉంటే మళ్ళీ పంపించాలి. అంతేతప్ప సంతకాలు పెట్టకుండా ఫైల్స్ రోజుల తరబడి పెండింగ్ ఉంచుకుంటే చాలా కష్టం. ఇదే విషయం ఆ ఆఫీసర్ కు కొత్త మంత్రి ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రత్యేకంగా ఫోన్ చేసినా ఉపయోగం లేకుండా పోయింది. అయితే ఆ మంత్రి సదరు అధికారి వ్యవహారాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలుస్తోంది.

### రెండో రోజుకు చేరుకున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయవాడ ఇంద్రకీలాద్రిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. దుర్గమ్మ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కుంకుమ పూజకు వచ్చే భక్తులకు దేవస్థానం అధికారులు ఇవ్వకపోవడంతో గందరగోళం ఏర్పడింది. పోలీసులు ఓంకారం వద్ద భక్తులను క్యూ లైన్ లో పంపిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయం కొరవడింది.

# కడియం పొలిటికల్ రిటైర్మెంట్...

వరంగల్, సెప్టెంబర్ 23, కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో ఫిరాయింపులు అనేవి సర్వసాధారణంగా మారిపోయాయి. 2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. దానికి రాజకీయ పునరేకీకరణ అని పేరు పెట్టుకుంది. 2018 లోనూ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించింది. అసలు ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. 2014, 2018 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర సమితి ఆటలు సాగాయి కానీ.. 2023 కి వచ్చేసరికి ఆ పరిస్థితి లేకుండా పోయింది. పార్టీ ఫిరాయింపుల వల్ల ఏర్పడిన ఇబ్బందిని గతంలో తెలంగాణ రాష్ట్ర సమితి చవిచూసింది. అందువల్లే ఆ ప్రతీకారాన్ని మిగతా పార్టీల మీద తీర్చుకుంది. అయితే అన్ని రోజులు ఒకే విధంగా ఉంటాయని భారత రాష్ట్ర సమితి అనుకుంది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో భారత రాష్ట్ర సమితి అనుకున్న లక్ష్యాలు మొత్తం తలకిందులయ్యాయి. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. భారత రాష్ట్ర సమితి నుంచి ఏకంగా 8 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కడియం శ్రీహరి కూడా ఒకరు. ఆయన భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా కూడా పనిచేశారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. పార్టీ ఫిరాయింపులపై భారత రాష్ట్ర సమితి ఏకంగా సర్వోన్నత న్యాయస్థానం వద్దకు వెళ్లడంతో.. తీర్పు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా వచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ లేఖ రాయడంతో ఇన్ని రోజులపాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారంతా.. తాము ఆ పార్టీలో చేరలేదని.. అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రిని కలిశామని స్పష్టత ఇచ్చారు. అయితే ఇందులో కడియం శ్రీహరి ఎలాంటి లేఖ రాశారో తెలియదు గాని.. తన రాజకీయ ప్రయాణానికి సంబంధించి కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల విలేకరులతో మాట్లాడిన ఆయన కీలక విషయాలను వెల్లడించారుపార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అధికారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు లేదని శ్రీహరి ఇటీవల పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత నైతిక విలువలు కేసీఆర్ కు గుర్తుకు వస్తున్నాయని విమర్శించారు. అయితే కడియం శ్రీహరి మాట్లాడిన మాటలు ఇలా ఉంటే.. గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా హ్యాండిల్స్ లో మాత్రం మరో విధంగా ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో కడియం శ్రీహరి పోటీ చేయబోనని చెప్పారని? ఇవే తన చివరి ఎన్నికలు అని పేర్కొన్నారని.. రాజకీయంగా ఆయన చరిత్ర ముగిసిపోయినట్టేనని రాసుకొచ్చింది. రాజకీయంగా కడియం శ్రీహరి బలమైన నాయకుడు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మంత్రిగా.. కెసిఆర్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. అటువంటి వ్యక్తి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను అంటే రాజకీయంగా సన్యాసం తీసుకున్నట్టు కాదు కదా.. పాపం గులాబీ పార్టీ సోషల్ మీడియా అడ్డగోలుగా ప్రచారం చేస్తోంది. తన కింద ఉన్న మరకలను మరచిపోతోంది. అలాగని ఇక్కడ కడియం శ్రీహరి విలువలు ఉన్న నాయకుడు అని చెప్పడం లేదు. గులాబీ పార్టీ మీద గెలిచి ఆయన కాంగ్రెస్లోకి వెళ్ళిపోయారు. అంతేకాదు తన కుమార్తెకు గులాబీ పార్టీ బీఫారం ఇచ్చినప్పటికీ.. పక్కనపెట్టి కాంగ్రెస్ లో లాబీయింగ్ చేసుకొని వచ్చారు. తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకొని ఏకంగా ఎంపీని చేసుకున్నారు. ఇంత జరిగింది కాబట్టి సహజంగానే గులాబీ పార్టీ సోషల్ మీడియాకు ఆగ్రహం ఉంటుంది. ఆ ఆగ్రహాన్ని ఇలా వ్యక్తం చేస్తోంది.

# మావోయిస్టులకు దారేదీ....

ఖమ్మం, సెప్టెంబర్ 23, ఆపరేషన్ కగార్తో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి సహా ముఖ్య నేతలంతా భద్రతా బలగాల చేతుల్లో ఎన్కౌంటర్ అవుతున్నారు. పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఈ తరుణంలో మావోయిస్టుల మధ్య ఉన్న సైద్ధాంతిక విభేదాలు బయటపడ్డాయి. శాంతి చర్చల కోసం తుపాకీ పక్కన పెడతామని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ అలియాస్ అభయ్ పేరుతో లేఖ విడుదల చేశారు. ఈ లేఖ విడుదల కాగానే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఎందుకంటే, మావోయిస్టు పార్టీకి తుపాకీ అనేది ఒక ఆయుధం మాత్రమే కాదు, అది ఒక సిద్ధాంతం. అయితే, ఈ ఆయుధాలు పక్కన పెడతామని అభయ్ పేరిట వచ్చిన లేఖను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్ పేరుతో మరో లేఖ విడుదల కావడం తీవ్ర చర్చకు దారి తీసింది. తుపాకీ పక్కన పెట్టడం అనేది పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, పార్టీ ఆలోచన అది కాదని ఆ లేఖలో స్పష్టం చేయడం జరిగింది. దీంతో మావోయిస్టు పార్టీలో సైద్ధాంతిక విభేదాలు బయటపడినట్లయింది. అయితే, అసలు తుపాకీ పక్కన పెట్టాలా వద్దా అన్న విషయంలో ఇంత పెద్ద చర్చ జరగడం వెనుక కారణాలు ఏంటి? మావోయిస్టు పార్టీ తుపాకీ విషయంలో ఎందుకు ప్రాధాన్యత ఇస్తుంది అన్న అంశాలు ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

మన దేశంలో అధికారంలోకి రావాలంటే బ్యాలెట్ ద్వారా రాజకీయ అధికారం దక్కుతుంది. కానీ, మావోయిస్టు పార్టీ సిద్ధాంతం ప్రకారం, రాజకీయ అధికారం తుపాకీ గొట్టం ద్వారానే ఉద్భవిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది మావో జెడాంగ్. మావో జెడాంగ్ (1893-1976) చైనా కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాకు మొదటి అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మార్క్సిజం, లెనినిజంల ఆధారంగా మావోయిజం అనే కొత్త విప్లవ సిద్ధాంతానికి రూపకల్పన చేశారు. దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారా చైనాను ఏకం చేసిన వ్యక్తి. చైనాలో నాటి భూస్వామ్య వ్యవస్థను రద్దు చేసి నవ చైనా రూపకల్పనకు నాంది పలికిన వ్యక్తి. చైనాలో కమ్యూనిస్ట్ పార్టీని శక్తివంతమైన రాజకీయ, సైనిక శక్తిగా రూపొందించడంలో మావో జెడాంగ్ కీలక పాత్ర పోషించారు. 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం' అన్న సాయుధ విప్లవ సిద్ధాంతాన్ని ప్రవచించింది మావోనే. ఆయన సిద్ధాంతాలు మన దేశంతోపాటు లాటిన్ అమెరికా, మరి కొన్ని ప్రపంచ దేశాల్లో విప్లవోద్యమాలను నడిపించాయి. ఆయన సిద్ధాంతాల ప్రభావం ఇప్పటికీ ప్రపంచ రాజకీయాలపై కనిపించడం విశేషం. ఈ సిద్ధాంతాన్ని మావో 1938లో ప్రతిపాదించారు. 1938లో చైనా - జపాన్ యుద్ధం జరుగుతున్న రోజుల్లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో మావో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 'యుద్ధం - వ్యూహాత్మక సమస్యలు' అనే ప్రసంగంలో ఈ సిద్ధాంతాన్ని మావో వివరించారు. యుద్ధం అనేది రాజకీయ లక్ష్యాలను సాధించే ఒక సాధనంగా చెప్పారు. యుద్ధం ద్వారానే అంటే ఆయుధంతోనే ప్రజలు అధికారంలోకి వస్తారని, "రాజకీయ అధికారం అనేది తుపాకీ గొట్టం నుండే వస్తుంది" అని ఎంతో మంది విప్లవకారులను తుపాకీ పట్టేలా ప్రేరేపించే సిద్ధాంతాన్ని ప్రకటించారు. మావో చెప్పిన ఈ సిద్ధాంతం విప్లవ పార్టీలకు, విప్లవకారులకు కీలకమైన విషయంగా మారింది. సాయుధ పోరాటం ద్వారానే సమ సమాజ స్థాపన జరుగుతుందని మావోయిస్టు పార్టీతో సహా సాయుధ పోరాటం అనుసరించే కమ్యూనిస్ట్ అండ్ మావోయిస్టు పార్టీలు ప్రపంచవ్యాప్తంగా నమ్మడం ప్రారంభించాయి. భూస్వామ్య వ్యవస్థలు, పాలక వర్గాలు ప్రజలను అణిచివేస్తుంటే వారికి విముక్తి కల్పించేది సాయుధ పోరాటమే, అందుకు తుపాకీ పట్టాల్సిందే అన్న సిద్ధాంతం ఇక్కడి నుండే మొదలైంది. శాంతియుత నిరసనలు, శాంతి మార్గం లేదా బ్యాలెట్ పద్ధతిలో ఈ మార్పు జరగదన్నది మావోయిస్టు పార్టీ సిద్ధాంతంగా మారింది. ఇక మన దేశంలో ఈ సిద్ధాంతం నక్సల్ బరీ ఉద్యమం నుంచి ప్రారంభమైంది. చారు మజుందార్ ఈ సిద్ధాంతపరమైన ఉద్యమానికి నాంది పలికారు. మావో జెడాంగ్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతాన్ని మన దేశంలోని భూస్వామ్య వ్యవస్థ దోపిడీని అరికట్టేందుకు అమలు చేయాలని నిర్ణయించారు. నక్సల్ బరీ ఉద్యమానికి సిద్ధాంతకర్త చారు మజుందార్ కాగా, ఈ తరహా ఉద్యమాన్ని ప్రారంభించిన నాయకుల్లో కానూ సన్యాల్ కూడా ఒకరిగా చెప్పాలి. 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం' అనే సిద్ధాంతం నాటి ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం వంటి ప్రాంతాలకు విస్తరింపజేసిన నాయకుల్లో కొండపల్లి సీతారామయ్యది కూడా కీలక పాత్ర. నాడు పీపుల్స్ వార్ గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు ప్రారంభించిన పార్టీ 2004లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియాగా ఏర్పడింది. అప్పటి నుంచి మావో జెడాంగ్ ప్రతిపాదించిన సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారం అనేది అధికార సిద్ధాంతంగా మారింది. తుపాకీ అనేది మావోయిస్టు పార్టీకి ఒక ఆయుధం కాదు. అది వారి పార్టీ సిద్ధాంతం. తుపాకీ పక్కన పెట్టడం అంటే సిద్ధాంతాన్ని పక్కన పెట్టడంలాంటిదేనని ఈ విప్లవ పార్టీలను దగ్గరగా చూసే చరిత్రకారులు చెబుతారు. అయితే, తుపాకీ ప్రాముఖ్యతపై ఇప్పుడు ఆ పార్టీలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అందులో భాగమే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు విడుదల చేసిన లేఖ, దాన్ని ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్ విడుదల చేసిన లేఖ. మారిన పరిస్థితులకు అనుగుణంగా తుపాకీ వదలి శాంతియుత మార్గాల ద్వారా లక్ష్యాన్ని చేరుకోవాలని కొందరు ప్రతిపాదిస్తుంటే, తుపాకీ విడిచిపెడితే ఉద్యమం బలహీనమవుతుందని మరికొందరి వాదన. ఈ భిన్నాభిప్రాయాలతోనే పార్టీలో చీలికలు రావచ్చని, అందులో భాగమే ఈ లేఖాస్త్రాలని కొద్ది మంది విశ్లేషకుల మాట. అయితే, ఏది ఏమైనా మావోయిస్టు పార్టీకి తుపాకీ అనేది పోరాట మార్గం కోసం మాత్రమే కాదు, అది రాజకీయ అధికారం కోసం అడుగులు వేసే ప్రాథమిక మార్గం అని చెప్పవచ్చు. అయితే, ఈ విషయంలో మావోయిస్టు పార్టీ అధికారిక నిర్ణయం ఏంటా అన్న ఉత్కంఠ మాత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా నెలకొంది. మరో వైపు భద్రతా బలగాలు మాత్రం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతం చేసేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. దీన్ని తుపాకీ ద్వారా అడ్డుకుంటారా, లేక శాంతియుత చర్చల ద్వారానా అన్న విషయం తేలాలంటే మాత్రం వేచి చూడాల్సిందే.

# సీఎం సహాయ నిధి.. పేద కుటుంబాలకు అండ..

## - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి, )సీఎం సహాయ నిధి.. పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల మరియు టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 80 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ.25,70,000/- విలువైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు, ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరామర్శ..ఈరోజు టేకుమట్ల మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన సాధ ఓదెలు(డిష్ ఆపరేటర్) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిట్యాల ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే దైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# టీఎస్ బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా గుండోజు ప్రవీణ్

**-నియామక పత్రాన్ని అందజేసిన జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్,రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రామ్ కుమార్**



మంథని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా కార్యదర్శిగా మంథని పట్టణానికి చెందిన స్వర్ణకార సంఘం నాయకుడు గుండోజు ప్రవీణ్ కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రామ్ కుమార్ తో కలిసి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ నియామక పత్రాన్ని గుండోజు ప్రవీణ్ కుమార్ కు అందజేశారు. తక్షణమే ఈ నియామకం అమలులోకి వస్తుందని జిల్లా అధ్యక్షుడు శంకర్ తెలిపారు. మంథని డివిజన్ లో బీసీ కులాలన్నిటిని సంఘటితం చేసేందుకు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గుండోజు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నన్ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ కు, నా నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రామ్ కుమార్ కు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. బీసీల ఐక్యత కోసం, తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు ముచ్చకుర్తి శ్రీనివాస్,దండే సదానందం లు పాల్గొన్నారు. ప్రవీణ్ నియామకం పట్ల స్వర్ణకార సంఘం నాయకులు వంగల తిరుమలేష్, మోదుంపురం విజయ్, సిరికొండ నాగన్న, కొమురోజు వేణు, సిరికొండ శ్రీనివాస్, లు హర్షం వ్యక్తం చేశారు.

# బన్సీలాల్ పేట శ్మశాన వాటిక స్థలం కుర్మ సంఘానిదే

## ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్ బన్సీలాల్ పేట్ లోని ఆ స్థలం కుర్మ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలమేనని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తమ స్మశానవాటిక స్థలంలో అక్రమంగా అనుమతులు తీసుకొని బహులంతస్తుల భవనం నిర్మాణము చేస్తున్నారని కుర్మసంఘం నాయకులు వివిధ రకాలుగా నిరసనలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం వీరికి అండగా మార్వాడీలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆందోళన కారులు సైతం వీరికి అండగా నిలవడం, వారితో కలిసి పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ నేపధ్యంలో ఈ రోజు తలసాని శ్రీనివాస్ యాదవ్ రెవిన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలం కచ్చితంగా కుర్మ సంఘవారికి చెందిన స్మశాన వాటిక అని తెలిపారు. ఈ స్థలం తమ స్వాదినంలోకి తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. కోర్టులో వివాదం ముగిసిన వెంటనే స్మశాన వాటికకు కావలసిన సౌకర్యాలన్నీ కల్పించి అప్పగిస్తానని వెల్లడించారు. తన పేరును దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కబ్జాదారులను హెచ్చరించారు.

# అమ్మ ప్రసాదం మహాద్భుతం..

# భక్తులు కోరినన్ని లడ్డూ ప్రసాదం సిద్ధం..

**11 రోజులకు 36 లక్షల లడ్డూలు**

**మూలా నక్షత్రం, విజయదశమి రోజున ఉచిత లడ్డు ప్రసాదం పంపిణీ**

**నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి ఉన్న ప్రత్యేకతలలో లడ్డు ప్రసాదం కూడా అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరు ఎక్కువ మొత్తంలో లడ్డూలు కొనుగోలు చేస్తారని, సాధారణంగా మామూలు రోజుల్లోనే లడ్డు ప్రసాదానికి ఎక్కువ డిమాండ్ ఉంటుందని, నవరాత్రి రోజులలో లడ్డు ప్రసాదం డిమాండ్ మరింత పెరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని శరన్నవరాత్రి ఉత్సవాలకు వస్తున్న భక్తులకు కోరినన్ని లడ్డూలు సిద్ధంగా ఉంచామని ఆయన తెలిపారు. లడ్డు ప్రసాద తయారీ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మొత్తంగా నవరాత్రి ఉత్సవాలకు 36 లక్షల లడ్డూలు అవసరమవుతాయని భావించి ఆ మేరకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎక్కువ



అవసరమైతే తయారు చేసేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా భక్తుల సంఖ్య అసాధారణ స్థాయిలో ఉంటుందన్నారు. అదే సమయంలో లడ్డు ప్రసాదానికి కూడా డిమాండ్ పెరుగుతుందని, దీన్ని దృష్టిలో లడ్డూలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. భక్తులకు ఆరోజు ఉచిత లడ్డు ప్రసాదం కూడా అందించడం జరుగుతుందన్నారు. రోజువారి రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రసాద విక్రయ కేంద్రాలను అప్పటికప్పుడు పెంచేందుకు దేవస్థానం సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఇప్పటికే కనకదుర్గ నగర్ తో పాటు రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో కూడా ప్రసాద విక్రయ కేంద్రాలు ఉన్నాయని.. భక్తులు ఆయా కేంద్రాల్లో కూడా కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రసాదం తయారీకి వినియోగిస్తున్న ముడి సరుకుల నాణ్యత కూడా పరిశీలించారు. లడ్డూలు ఎక్కువ కాలం నిలువ ఉండేలా అత్యంత నాణ్యత కలిగిన శనగపిండి, పంచదార, నూనె, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి వాడుతున్నట్లుగా గమనించారు. అత్యంత పరిశుభ్ర వాతావరణంలో ఈ లడ్డు ప్రసాదం తయారు అవుతోందని వివరించారు. లడ్డు తయారీ కేంద్రాల నుంచి ఇతర ప్రాంతాల లడ్డు విక్రయ కేంద్రాలకు రవాణా చేసే సమయంలో రవాణా వాహనాలకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను చక్క దిద్దాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో దేవస్థానం ప్రసాదం కేంద్రం సహాయక అధికారి ఎం ఎస్ ఎల్ శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.రియల్ టైం ఫీడ్బ్యాక్ ఆధారంగా సేవలు: రియల్ టైం ఫీడ్ బ్యాక్ ఆధారంగా భక్తులకు సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించామని తెలిపారు.

## మెగా ఉచిత వైద్య శిబిరం ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ప్రాథమిక పాఠశాల (MPP), పాత తోషం గ్రామం లో శ్రీ మదన్ గిత్తే, జై దేవి మెడికల్, గుడిహాత్నూర్ వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ముఖ్య అతిథులు గా జిల్లా కలెక్టర్ రాజర్షి షా , జిల్లా ఎస్.పీ. అఖిల్ మహాజన్ లు పాల్గొనీ కార్యక్రమాన్ని ప్రారంభించారు .

వైద్య శిబిరం ప్రత్యేకతలు :

నిపుణులైన వైద్యులచే అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు బీపీ, షుగర్, వైరల్ జ్వరాల పరీక్షలు రక్తపరీక్షలు, స్కానింగ్ సదుపాయం

అవసరమైన మందుల ఉచిత పంపిణీ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

.ప్రభుత్వ ఆసుపత్రులు, రిమ్స్ సేవలను ప్రజలు



వినియోగించుకోవాలని, అనారోగ్య బారిన పడిన మా తల్లిదండ్రులను రిమ్స్ లోనే వైద్య చికిత్సలు చేయించుకోవడం జరిగిందనీ ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు ..



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి**జిల్లా కేంద్రం లోని STU భవన్ లో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరద బాధితులకు కిట్స్ పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు పాల్గొని వరద బాధితులకు అందజేశారు .

## బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించనున్న జి.హెచ్.ఎం.సి - డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి...!!!

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, జి.హెచ్.ఎం.సి పరిధిలో సర్కిల్ వారీగా బతుకమ్మ పోటీలు ఏర్పాటు చేయడం జరగనున్నది.

ఈ సందర్భంలో సికింద్రాబాద్ సర్కిల్ బతుకమ్మ కార్యక్రమం రేపు సాయంత్రం సీతాఫల్మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబడనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి గారు సికింద్రాబాద్ సర్కిల్ డిపిఓ శ్రీ శ్రీనాథ్ గారికి సూచించారు.

బతుకమ్మ పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, సదస్సు ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, భద్రత, వైద్య సదుపాయాలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆమె అధికారులకు ఆదేశించారు.

అలాగే మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

డిప్యూటీ మేయర్ గారు ప్రభుత్వం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల సహకారం అందిస్తున్నదని తెలిపారు.

## ప్రభుత్వ ఆయుర్వేద వైద్య సేవలు వినియోగించుకోవాలి
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కరీంనగర్ రామ్ నగర్ లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రదర్శనలో ఉంచిన ఆయుర్వేద ఔషధాలను, పలు రకాల ఆయుర్వేద మొక్కలను పరిశీలించారు. ఇక్కడ యోగా కేంద్రంలో యోగాసనాలను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆసుపత్రిని సందర్శించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ సహా ప్రభుత్వం నుంచి లభించే ఉచిత వైద్య సేవలు, ఔషధాల వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఆయుష్ డిపార్ట్మెంట్ నుండి అందజేస్తున్న సేవలను వివరంగా రోగులకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణీలకు సాధారణ ప్రసవానికి మేలు చేసే యోగాసనాలను గురించి తెలియజేయాలన్నారు. ఆస్పత్రి ఆవరణను సుభ్రం చేసి మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, యునాని సీనియర్ మెడికల్ ఆఫీసర్ యసబ్ సుల్తానా, డి.పి.ఎం జి.ప్రవీణ్ కుమార్, ఆర్.నీరజ పాల్గొన్నారు. హైపటైటిస్ వ్యాక్సినేషన్ పరిశీలన వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న హైపటైటిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నేషనల్ వైరల్ హైపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా హైపటైటిస్ వ్యాధిగ్రస్తుల నుండి వైద్యులు, సిబ్బందికి వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్ వల్ల వైద్య సిబ్బందికి రోగ నిరోధక శక్తి పెరిగి కాలేయ సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్ సమస్యలు నివారించవచ్చన్నారు. అనంతరం ఆస్పత్రిలోనే పలు విభాగాలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్.ఎం.ఓ నవీనా, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిత పాల్గొన్నారు.

# కేబీఆర్ పార్కు ప్రాజెక్టు పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలి

### భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
### క్షేత్ర పరిశీలనలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులకు ఆదేశం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**జిహెచ్ఎంసి, సెప్టెంబర్ 23, 2025:గ్రేటర్ హైదరాబాద్ లో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్ %-% సిటీ పనులను సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని, పనుల గ్రౌండింగ్ సాధ్యమైనంతర త్వరగా ప్రారంభించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కమిషనర్ , ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) భాస్కర్ రెడ్డి, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య తో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నం.2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కేబీఆర్ పార్కు ప్రాజెక్టు భూ సేకరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హెచ్ సిటీ లో కీలకమైనకేబీఆర్ పార్కు ప్రాజెక్టులో భాగంగాకేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ఏడుకీలక జంక్షన్లలో రాబోయే రోజుల్లో 4.6 కి.మీ పొడవు గల ఫ్లైఓవర్లు, 2.8 కి.మీ అండర్‌పాసులు నిర్మించనున్నారు. వీటితో నగరంలో అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ప్రవాహం సులభతరం అవ్వడంతో పాటు, రద్దీ గణనీయంగా తగ్గనుంది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ వి కర్ణన్ కేబీఆర్ పార్కు ప్రాజెక్టు గ్రౌండింగ్ కుజోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ లు, ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పనుల గ్రౌండింగ్ వేగంగా చేపట్టడమే కాకుండా, పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనులు జరిగే సమయంలో ట్రాఫిక్ కుఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా బ్యాంక్ సేవలు అందించాలి

విజయవాడ నోవాటెల్ హోటల్లో లోక్ సభ సభార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ బ్యాంకుల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రజల సమస్యల పరిష్కారం, రుణాల మంజూరు ప్రక్రియలో పారదర్శకత, చిన్న వ్యాపారులు, రైతులకు సులభ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ ప్రోత్సాహం, బ్యాంకింగ్ రిఫార్మ్స్ అమలు పై చర్చ జరిగింది. ప్రజలకు చేరువైన ఆర్థిక సేవలు అందించే మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా బ్యాంక్ సేవలు అందించాలని, ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని, సామాజిక బాధ్యతలలో బ్యాంకులు ముందుండాలని ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. .

# హోంగార్డు సిబ్బందికి కమిషనర్ కార్యాలయంలో దర్బార్

### క్షేత్రస్థాయిలో ఉన్న వారి సమస్యలు అడిగి తెలుసుకున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



సిద్దిపేట యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ చాలా ముఖ్యంహోంగార్డు నుండి ఉన్నతాధికారి వరకు అందరం ఒక కుటుంబ సభ్యులము. హోంగార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమే. హోంగార్డుల సంక్షేమానికి ఎల్లావేళలా కృషి చేస్తామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ చాలా ముఖ్యమని యూనిఫాంలో ఉన్న వారిని పదిమంది గమనిస్తూ ఉంటారని అది తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. చిన్న చిన్న పొరపాట్లతో జీవితం నాశనం చేసుకోవద్దు, వ్యక్తిగతంగా డిపార్ట్మెంట్ పరంగా క్రమశిక్షణ చాలా ముఖ్యం, ఎవరు కూడా విధులకు చెప్పకుండా ఆబ్సెంట్, గైర్హాజర్ కావద్దని సూచించారు, ఒకరికొకరు మర్యాద ఇచ్చిపుచ్చుకోవాలి, ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రతిరోజు వాకింగ్ రన్నింగ్ స్విమ్మింగ్ యోగ మెడిటేషన్ ఏదో ఒకటి తప్పకుండా చేయాలి,ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహించగలుగుతాం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఆల్కహాల్ వాటికి బానిసలు కావద్దని సూచించారు, విధినిర్వహణ కుటుంబాన్ని సమభాగాలలో చూడాలని తెలిపారు, ఆన్లైన్ గేమ్స్ ఆన్లైన్ బెట్టింగ్ ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. సివిల్ వివాదాలలో తల దూర్చవద్దన్నారు, మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు నడిపేటప్పుడు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు, వచ్చే జీతం లో కొన్ని డబ్బులు భవిష్యత్తు అవసరాల గురించి పొదుపు చేసుకోవాలని తెలిపారు, ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని తెలిపారు. రేనికోట్స్, ఉలన్ జర్కిన్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. జిల్లాలో హోంగార్డ్ మంచిగా విధులు విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. జిల్లాలోని హోంగార్డ్స్ పిల్లలు జిల్లాలో ఏ ప్రైవేట్ స్కూల్లో చదివిన 50% ఫీజ్ కన్సిషన్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దర్బార్ నిర్వహించడం జరుగుతుందన్నారు. హోంగార్డు సిబ్బందికి విధి నిర్వహణలో కానీ వ్యక్తిగతంగా కానీ ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు, యూనిఫాం సర్వీస్ డెలివరీలో అందరూ సమానమని అందరము ఒకే కుటుంబ సభ్యులకు సంబంధించిన వారిమని తెలిపారు,ప్రతి శనివారం పెరేడ్ నిర్వహించినప్పుడు మీ సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు వెంటనే తెలపాలని సూచించారు. పోలీసు శాఖలో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని, ప్రతి పోలీస్ స్టేషన్ లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని, ఇక ముందు కూడా ఇదే అదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. పోలీస్ శాఖలో పని చేస్తున్నప్పుడు సర్వీస్ నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించరాదని, డ్యూటీలో ఉన్న ఆఫ్ డ్యూటీలో ఉన్న పోలీస్ శాఖ ప్రతిష్టను భంగపరిచే విధంగా ప్రవర్తించరాదని, అందరూ క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. పోలీస్ శాఖ లో పనిచేస్తూ నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. మీమీ సమస్యలు ఏమైనా ఉంటే వారి అధికారులకు, ఏఆర్ అడిషనల్ డీసీపీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్, ఆర్ఎస్ఐ, లేద సిపి కార్యాలయానికి వచ్చి నేరుగా తెలపాలని సూచించారు. క్రమశిక్షణ తప్పితే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దర్బార్ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్తీక్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, హోంగార్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జిల్లాలో ఉన్న హోంగార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలోని వైఎస్సార్ కాలనీలో అర్ధరాత్రి దొంగల బీభత్సం
### అర్ధరాత్రి 6 ఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగలు

ఖమ్మం నగరంలోని వైఎస్సార్ కాలనీలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 6 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. విలువైన బంగారు ఆభరాలు,వెండి,నగదు ఎత్తుకెళ్లారు. దసరా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లిన ఇళ్లను ఎంచుకొని తాళాలు పగులగొట్టి చోరికి పాల్పడ్డారు. ఎనిమిది మంది దొంగల ముఠా ఒంటిపై దుప్పట్లు కప్పుకొని వచ్చినట్లుగా బాధితులు చెబుతున్నారు. వరస దొంగతనాలతో ఖమ్మం పట్టణ ప్రజలు బెంబెలెత్తుతున్నారు. చివరకి కానిస్టేబుల్ ఇంటిని కుడా దొంగలు వదలలేదు. సీసీ కెమెరాలు ఉన్న ఇంట్లో, మనుషులు ఉన్నా పట్టించుకోకుండా దొంగలు హల్ చల్ చేసారు.

## ఆట పాటలతో చదువు నేర్పించాలి

### పోషన్ భీ పడాయి భీ ఓరియంటేషన్ కార్యక్రమంలో

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 23:** చిన్నారులకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని, ఆట పాటలతో చదువు నేర్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు.

పోషన్ భీ పడాయి భీ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శామీర్ పేట మండంలలోని ఆలియాబాదు అంగన్ వాడీ సెంటరును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ వారి ఆట పాటలను చూస్తూ సంతోషం వ్యక్తం చేసారు. వంట సామాగ్రిని పరిశీలించి, అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, అంగన్ వాడీ టీచర్ చిన్నారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక

### బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా కలెక్టరేట్లో బతుకమ్మ వేడుకలు








**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 23:** "బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక".

బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక.

జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా యంత్రాంగం తరపున మంగళవారం జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనికలు కొలతలు, కార్మిక శాఖలతోపాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హౌజ్ కీపింగ్ వారి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాధిక, కలెక్టరేట్ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి కలెక్టరేట్లో ఘనంగా రెండవ రోజు బతుకమ్మ పండుగ సంబరాలు

### తెలంగాణ మహిళల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

### జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/తెలంగాణ మహిళల సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక గా నిలుస్తుంది అని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో జిల్లా విద్యాశాఖ , ఇంటర్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ ల ఆధ్వర్యంలో రెండవ రోజు బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడారు. తెలంగాణ మహిళల ఆత్మీయత, ఆధ్యాత్మికత, సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక గా నిలుస్తుంది అన్నారు. ప్రకృతిని దైవంగా పూజించి పండుగగా బతుకమ్మ పండుగ అన్నారు. ఇలాంటి పండుగలను నిర్వహించడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలుపవచ్చు అన్నారు. భావి తరాల కు చెందిన పిల్లలకు సంస్కృతి , సాంప్రదాయాలతో పాటు విలువలను కూడా తెలపడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ,మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి , పాటలు పాడి బతుకమ్మ పండుగ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు ఉద్యోగులు విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డి ఐ ఈ ఓ గోవింద్ రామ్,ఉపాధ్యాయులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట పోలవరం నిర్వాసితుల అందోళన

కాకినాడ పోలవరం కాలువ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ కాలనీకి చెందిన పలువురు కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పోలవరం కాలువ నిర్మాణంలో సుమారు 300 మంది పైగా నిర్వాసితులవుగా వారిలో కొందరికి న్యాయం చేశారని ఇంకా 22 కుటుంబాలకు ప్రభుత్వం అందించే సహాయం అందలేదని వారు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు అందించినా న్యాయం చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించిన సహకారం మేరకు వారికి సహకరించామని అందువల్ల నిర్వాసితులైన 22 కుటుంబాల వారికి పునరావాసం కల్పించి న్యాయం చేయాలని కోరారు.

## పేదలను దోచుకోవడానికి జీఎస్టి తెచ్చారు

### జీఎస్టి అంటే గబ్బర్ సింగ్ టాక్స్ :మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ సెప్టెంబర్ 23 ;పేదలను దోచుకోవడానికి జీఎస్టి తెచ్చారని, జీఎస్టి అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం గాంధీ భవన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా బీజేపీ ప్రజలను దోచుకుందని,కేంద్ర ప్రభుత్వం ఇన్ని రోజులు పేద ప్రజల రక్తం తాగిందని ఆరోపించారు.జీఎస్టి తో పేదలకు లబ్ది చేసినట్టు బీజేపీ నాయకులు బిల్డప్ ఇస్తున్నారుజీఎస్టి అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అని మొదటి నుండి చెప్తున్నాంపేదలను దోచుకోవడానికి జీఎస్టి తెచ్చారుశవ పేటికలపై, పసి పిల్లల తినుబండారాలపై కూడా జీఎస్టి వేశారుజీఎస్టి ట్యాక్స్ తో ఏదైనా మంచిపని చేశారా..? అని ప్రశ్నించారు.ఆర్థిక సంక్షోభం నుండి తప్పించుకోవడానికే మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందితెలంగాణకు 7 వేల కోట్ల నష్టం వస్తోంది. దీన్ని పూడ్చే బాధ్యత కేంద్రానిదేతెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రి సంజయ్, కిషన్ రెడ్డి లు తెలంగాణకి వస్తున్న నష్టాన్ని ఎలా పుడుస్తారో చెప్పాలికేంద్రం పెద్దన్న పాత్ర పోషించి అండగా ఉండాలిగుజరాత్ , ఏపీ, బీహార్ లాంటి రాష్ట్రాలను తప్పాజీఎస్టి తెచ్చి పేదల నడ్డి విరిచింది మీరే... ఇప్పుడు తగ్గించింది మీరేజీఎస్టీ తగ్గింపు అంత ఎన్నికల డ్రామా.. ఇంకా జీఎస్టీ ఫలాలు పేదోడి కి అందలేదుజీఎస్టీ స్లాబుల పేరుతో ప్రతి వస్తువు మీద అదనపు పన్నులు వేసి పేదలు మోయలేని భారాన్ని చేశారు.జీఎస్టీ వచ్చి 8 సంవత్సరాలు అయింది.. 8 సంవత్సరాల తర్వాత ప్రజలకు ఇన్ని వేల కోట్లు ఆదా అవుతున్నాయని చెబుతున్నారు.. అంటే 8 సంవత్సరాలు మీరు ప్రజల రక్తం పీల్చుకు తిన్నట్టే కదా..మా నాయకుడు రాహుల్ గాంధీ మొదటి నుండి చెబుతున్నారు.. ఇది జీఎస్టి కాదు గబ్బర్ సింగ్ ట్యాక్స్ అనిఇది సహేతుకంగా లేదు.. స్లాబులు కాదు రేట్లు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.. కాని కేంద్ర ప్రభుత్వ మాత్రం పెడచెవిన పెట్టిందిమీరు తెచ్చిన జీఎస్టీ లో 18,24 శాతలలో ప్రజలు అధికంగా వినియోగించే వస్తువులు చేర్చారు..పది సంవత్సరాలపాటు జీఎస్టీ రూపంలో దోచుకున్నారుగడిచిన ఆరు మాసాల కాలంలో 22 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల విశాఖపట్నంలో మాట్లాడారు.. దీనిని బట్టి జీఎస్టీ రూపంలో పిండేసి ఇప్పుడు వెన్నపూసినట్లుగా 5,18 శాతం మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చెప్తున్నారుజీఎస్టీ తో నిత్యవసర వస్తువుల ధరలు డబుల్ అయ్యాయి10 రూపాయలు ఉన్న ఉప్పు పాకెట్ 20 రూపాయలు అయింది..60 రూపాయలు ఉన్న కందిపప్పు 160 రూపాయలు అయింది..70 రూపాయలు ఉన్న ఆయిల్ పాకెట్ 160 రూపాయలు అయింది..మీరు వేసిన జీఎస్టీ రొట్టెలు తినే పేదవాడి మీద ఎక్కువ జీఎస్టీ లగ్జరీ వస్తువుల మీద మాత్రం తక్కువ జీఎస్టీ ఉండేది.. ఫైవ్ స్టార్ హోటల్లో ఫుడ్ కి తక్కువ జీఎస్టీ వేస్తే చిన్న హోటల్లో కప్పు టీ కి మాత్రం ఎక్కువ జీఎస్టీ వేసి దోచుకున్నారుపెట్రోల్ ,డీజిల్ జీఎస్టీ లో చేర్చాలని తద్వారా పన్ను రేటు తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందని చాలా రాష్ట్రాలు విజ్ఞప్తి చేశాయి.. ఇప్పటి వరకు పెట్రోల్ డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తేలేదుమీరు శవ పేటికలకు కూడా జీఎస్టీ వేసారు శవాలను దహనం చేసే సమయంలో చెల్లించే సొమ్ముపై జీఎస్టీ తీసేయాలని విజ్ఞప్తి చేశారుఇప్పుడు మీరు తగ్గించిన జీఎస్టీ ఫలాలు పేదోడి కి ఎంత వరకు అందుతాయో చూడాలన్నారు. నిన్న తగ్గిన జీఎస్టీ అమలులోకి వచ్చిన పాత ధరలే తీసుకున్నట్లు వార్తలు చూసాంఇన్ని సంవత్సరాల తరువాత ఎన్నికలు వస్తున్నాయని రియలైజ్ అయి జీఎస్టీ తగ్గిస్తున్నట్లు నిర్ణయం తీసుకుందికేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలి ఒక చేతితో ఇచ్చి మరొక చేతితో తీసుకునట్లు ఉందిజీఎస్టీ కౌన్సిల్ ను ప్రజాస్వామ్య బద్దంగా ఏర్పాటు చేయాలి...కేంద్ర ప్రభుత్వం ది పెత్తనం ఉందితెలంగాణ రాష్ట్రం కొత్త జీఎస్టి వల్ల ప్రతి సంవత్సరం 7000 కోట్ల రూపాయలు నష్టపోతుందిరాష్ట్రాలు నష్టపోతున్న దానిని కేంద్ర ప్రభుత్వమే భరించాలి.. జీఎస్టీ తగ్గించి కేంద్ర ప్రభుత్వం మీ చావు మీరు చావండి అన్న విధంగా వ్యవహరిస్తున్నారుసంక్షేమం మొత్తం రాష్ట్రాల మీద రుద్దుతున్నారు.. కేంద్ర ప్రభుత్వ మాత్రం సెస్ ల పేరుతో దండుకుంటున్నారు జీఎస్టీ తీసుకొచ్చినప్పుడు 10 సంవత్సరాల పాటు రాష్ట్రాల నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది అని చెప్పారు.. కానీ పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదుఇప్పుడు తెలంగాణ రాష్ట్రం నష్టపోతున్న 7 వేల కోట్ల రూపాయల పై మాకు ఎంత ఇస్తారు ప్రామిస్ చేయాలిరాష్ట్రాలు నష్టపోతున్న దానిపై తెలంగాణలోని కేంద్ర మంత్రుల కిషన్ రెడ్డి ,బండి సంజయ్ లు కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడించాలి..మీరు కేంద్రం నుండి స్పష్టత ఇవ్వాలని పొన్నం ప్రబాకర్ స్డిమాండ్ చేసారు.

## రాగల ఐదురోజులు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు



హైదరాబాద్ సెప్టెంబర్ 23 తెలంగాణలో ఇప్పటికే వర్షాలు దంచికొడుతున్నాయి. జోరుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభిస్తున్నది. వర్షాలకు వదరలు పోటెత్తుతున్నాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల ఐదురోజులు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతుందని తెలిపింది. అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతుందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లోని గంగా తీర ప్రాంతాలు, ఉత్తర ఒడిశా, వాయువ్య బంగాళాఖాతం నుంచి తెలంగాణ మీదుగా ఒడిశా వరకు ద్రోణి కొనసాగుతుందని.. సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్లు, 3.1 కిలోమీటర్ల వరకు కొనసాగుతుందని తెలిపింది. ఈ నెల 25న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 26న ఏపీ తీరాన్ని ఆనుకొని వాయువ్య, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. 27న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వివరించింది. ఈ క్రమంలో తెలంగాణలో అతిభారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని అంచనా వేసింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వివరించింది.

## వీధి వ్యాపారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

విశాఖపట్నం కూటమి ప్రభుత్వం వీధి వ్యాపారులపై కక్షసాధింపు చర్యలకు పాల్ప డుతోందని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె. కె. రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు ఇవ్వకుండా తోపుడు బండ్లు, బడ్డీలను కూల్చివేయడం దారుణమని విమర్శించారు. ఈ చర్యలకు నిరసనగా, కె. కె. రాజు ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు, హాకర్లతో కలిసి విశాఖ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా నిరసనకారులు ఆందోళన కొనసాగించారు.ప్రభుత్వం ఏకపక్షధోరణితో చిరువ్యాపారస్థులపై కక్షకట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజాధనం వృథా - గోరుకంటి విఠల్





**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 23 సెప్టెంబర్ 2025**మణికొండ మునిసిపల్ పరిధిలో ఎందెందు వీధిలో వేదికి చూసిన అందందు కలవు రహదారి గుంతలు అన్న చందాన ఏక మొత్తంగా ప్రతి వీధిలలో రహదారుల మరమ్మత్తులు ఉన్నను కనీసం అటువైపు చూసి చూడనట్లు అధికారులు వ్యవహరించడం విచిత్రంగా ఉన్నదని మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గోరుకంటి విఠల్ వాపోతు అట్లాగే పుప్పాలగూడ బిగోనియా అపార్ట్మెంట్ కూడలిలో ఉన్న రహదారి కాస్త దెబ్బతిన్న మాట వాస్తవం కాగా, అట్టి రోడ్డుకు చిన్న పాటి మరమ్మత్తులు చేయకుండా ఆద్యంతం మంచిగా ఉన్న రోడ్డును ఏక మొత్తంగా పెకిలించి కొత్త రోడ్డు వేయడానికి చేసే ప్రయత్నం లోని మతలబు ఏమిటో వివరించాలని డిమాండ్ చేయడం జరిగినదని పర్యవసానంగా స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ మునిసిపల్ అధికారులు చేసే పనినీ తీవ్రముగా ఖండిస్తూ, సదరు పని ఎవరి వత్తిడి వలన, ఎవరి ప్రోద్భలంతో కొనసాగిస్తున్నారో తెలుప వలసిన కనీస బాధ్యత అధికారులపై ఉన్నదని స్థానిక నాయకులు కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

# వీధి దీపాలు లేక అంధకారంలో ముదిమాణిక్యం

## రాత్రిపూట బయటకు రావాలంటే జంకుతున్న జనం

## పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని గ్రామ కార్యదర్శి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:** పుల్కల్ మండల పరిధిలో గల ముదిమాణిక్యం, గ్రామంలో ప్రతి వాడ వాడ వీధి దీపాలు వెల గకపోవడంతో, గ్రామం మొత్తం రాత్రిపూట చీకటిగా మారుతుంది, గ్రామంలోని పంచాయతీ కార్యదర్శిని గ్రామస్తులు వీధిపాలు ఏర్పాటు చేయాలని అడగడంతో, ఆయన గ్రామస్తులను,నన్ను కాదు అడిగేది,వీధి దీపాల గురించి గ్రామ మాజీ సర్పంచిని అడగండి అని సమాధానం చెబుతున్నాడు, గ్రామ మాజీ సర్పంచిని అడిగితే, మా సర్పంచి పదవి ముగిసి రెండు సంవత్సరాలు గడుస్తుంది, ఇప్పుడు గ్రామం పూర్తి బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులకు మాత్రమే బాధ్యత ఉందని, ఆయన తెలిపారు,దీంతో అయోమయంలో గ్రామస్తులు, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గ్రామ పంచాయతీలకు నిధులను, అలాగే మాజీ సర్పంచులకు, పెండింగ్ బిల్లులను చెల్లించి, పేరుకే ప్రజా పాలన ప్రభుత్వం అని చెప్పుకోవడం కాకుండా, గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి పరచాలని, గ్రామ ప్రజలు కోరుతున్నారు...

# మృతుడి అంత్యక్రియలకు

# ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 23( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా'మర్పల్లి /మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన నడిమిదోడ్డి దుర్గయ్య అనారోగ్యముతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు.. అట్టి విషయం తెలుసుకుని ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి మంగళవారం దుర్గయ్య అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు పంపించగా గ్రామ నాయకులు, గ్రామస్తులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్ ట్రస్ట్ నుండి పంపిన నగదును అందజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, చుక్కా రెడీ, మధుసూదన్ రెడ్డి, ఈ.వెంకట్, ఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ నిర్మాణానికి జోరుగా సాగుతున్న పనులు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:** అందోల్ నియోజకవర్గంకు కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి పుల్కల్ మండలం బస్వాపూర్, గ్రామ శివారులో, సుమారు 300, కోట్ల నిధులతో 30, ఎకరాల విస్తీర్ణం భూమిలో పాఠశాలను నిర్మించనున్నారు, ప్రస్తుతం జెసిబిలు వాహనాల సహాయంతో, గుంతలకు మరమ్మతులు చేస్తున్నారు, త్వరలో రెసిడెన్షియల్ స్కూల్, నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు....



స్థలాన్ని చదును చేస్తున్న యంత్రాలు

# మృతురాలు కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు

# శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 23( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా** : మర్పల్లి మండల పరిధిలోని కొంశట్పల్లి గ్రామానికి చెందిన ముష్టి పరమ్మ ఆకస్మికంగా మరణించడం జరిగింది

ఇట్టి విషయం తెలుసుకున్న %దీ=ా% పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు

అంత్యక్రియల కొరకు 5000/- రూపాయలు ఆర్థిక సహాయం పంపడంతో మండల రైతు బందు మాజీ అధ్యక్షులు నాయబ్ గౌడ్ మరియు పార్టీ నాయకులు మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు వీరేశం గౌడ్ రూప్ చందర్ నర్సింలు పశువులు రావి శ్రీనివాస్ మన్నెఅడవయ్య మంగళ శ్యాం శ్రీశేలం కుమార్ ప్రభు కంకోల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# సీజీఎం రవీంద్రనాథ్ కు వినతి పత్రం సమర్పించిన టిజియుఈఈయు సిఐటియు

## నూతన డివిజన్లో కొత్తగా స్టాఫ్ ని నియమించాలి

## కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ప్రసాద్




**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం)** ఖమ్మంఖమ్మం వచ్చిన సిజిఎం రవీంద్రనాథ్ కి సర్కిల్ ఆఫీసులో వినతి పత్రం ఇవ్వడం జరిగింది వైరా డివిజన్ ఏర్పాటు లో ఓ మరియు ఎం కార్మికుల సీనియారిటీ విషయంలో న్యాయం చేయాలని ఆప్షన్ అవకాశాలు కల్పించాలని సీనియారిటీ నష్టపోకుండా చేయాలని వీఆర్వో ఏర్పాటు చేసిన వాటిల్లో సౌకర్యాలు కల్పించాలని, సరియైన స్టాఫ్ ని ఇవ్వాలని పారదర్శకంగా చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో నాయకులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

# అశోక్ సార్ దీక్షకు విద్యార్థుల మద్దతు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లా కేంద్ర గ్రంథాలయ విద్యార్థులు,నిరుద్యోగుల జేఏసీ చైర్మన్ అశోక్ సార్ చేస్తున్న దీక్షకు మద్దతుగా విద్యార్థులు సంఘీభావం తెలిపారు,ఈ సందర్భంగా నిరుద్యోగ విద్యార్థులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి రెండు లక్షల ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ని తక్షణమే విడుదల చేయాలని నిరసనలు తెలిపారు, లేకపోతే రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో మా నిరుద్యోగుల సత్తా ఏందో ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపిస్తాం . అదేవిధంగా ప్రస్తుతం అశోక్ సార్ చేస్తున్న నిరాహార దీక్ష లో సార్ కి జరగరానిది ఏదైనా జరిగితే తెలంగాణ రాష్ట్రం మొత్తం అగ్నిగుండం అవుతది నిరుద్యోగులు మొత్తం హైదరాబాద్ దిగ్బంధం చేస్తాం అని కాంగ్రెస్ ప్రభుత్వంను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ విద్యార్థులు, జంఫ్గీ జాన్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్,మోహన్,పవన్ కుమార్ గౌస్,భవాని,మనీషా,మరియు వివిధ స్టడీహాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మూల మలుపులు కావు ప్రమాదాలకు నిలయాలు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ఆందోల్- జోగిపేట మండల పరిధిలోగల అన్నా సాగర్ గ్రామపంచాయతీ శివారులో అకోలా- నాందేడ్, 161, జాతీయ రహదారి, అన్నా సాగర్ చెరువు కట్టపై మూలమలుపులో ప్రమాదాలు జరిగి, ప్రాణాలు పోతున్న,( ఆర్ అండ్ బి) శాఖ, అధికారులు, నిర్లక్ష్యపు మత్తులో నిద్రిస్తూ, ప్రజల ప్రాణాలు పోతున్న, పట్టించుకున్న వారే కరువయ్యారని, వాహన చోదకులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,, ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ప్రమాదాలు సూచించే సూచిక బోర్డులు కనిపించడం లేదు, రహదారికి ఇరుపక్కల, చెట్లు పిచ్చి మొక్కలు వేపుగా పెరిగి, దారిని కప్పేస్తున్నయి, దీంతో రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి, ఇకనైనా ( ఆర్ అండ్ బి )అధికారులు శాఖ అధికారులు, నిర్లక్ష్యపు నిద్రను వీడి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రహదారికి ఇరుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, వాహనదారులు, ప్రజలు, యువజన సంఘం నాయకులు, కోరుతున్నారు....

# దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత



విజయవాడ హోంమంత్రి అనిత మంగళవారం నాడు దుర్గమ్మను దర్శించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. సుపరిపాలన అందిస్తున్న సీఎం చంద్రబాబు, పవన్, లోకేష్ కు శక్తి, మంచి ఆరోగ్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరుకున్నా. మా కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోంది.. మరో 20 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వం ఉండాలని ప్రార్థించా. ఏపీపై సైకోల కళ్లు పడకూడదని దుర్గమ్మను వేడుకున్నానని అన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుంది

## మంత్రి గడ్డం వివేక స్వామి



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 :రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని,అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేద ప్రజలకు గూడు కల్పించే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు చొప్పున కేటాయించి అర్హత గల లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హత కలిగి ఉండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానీ వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. గత 10 సంవత్సరాలలో అందని రేషన్ కార్డులను అర్హత గల ప్రతి ఒక్కరికి అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కొరకు 9 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు.నూతన గనుల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.మందమర్రి ప్రాంతంలో రహదారులు,మురుగు కాలువల వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించడం జరిగిందని,50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.అమృత్ పథకం ద్వారా మందమర్రి ప్రజలకు శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు.విద్యావ్యవస్థను పటిష్టపరిచే చర్యలలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించి, దాదాపు 10 వేల మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని,ఈ విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్,ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల రూపాయల పరిమితితో రాజీవ్ ఆరోగ్యశ్రీ,ముఖ్యమంత్రి సహాయనిధి,200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని 82 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 6 లక్షల రూపాయల మున్సిపల్ నిధులతో నూతనంగా పునరుద్ధరించబడిన మెప్మా కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు,మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... ఈ కార్యాలయం 567 స్వయం సహాయక సంఘాలలోని 5 వేల 948 మంది మహిళా సభ్యులు సమావేశాలు,బ్యాంకు సంబంధిత కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థిక స్వావలంబన పొందాలని,తమ కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.మహిళ సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం క్యాతనపల్లి పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 2 కోట్ల రూపాయల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వివిధ వైద్య పద్ధతులకు ఆద్యం లిఆయుర్వేద వైద్యం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 : ప్రపంచంలోని వివిధ వైద్య పద్ధతులకు భారతీయ ఆయుర్వేద వైద్యం ఆద్యం పోసిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం 10వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆర్.ఎం.ఓ.భీష్మ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ రకాల వైద్య పద్ధతులకు భారతీయ ఆయుర్వేద వైద్యం పునాది లాంటిదని అన్నారు.నాచురోపతి, యునాని,యోగ ఇతర అనేక పద్ధతులను వినియోగించి అనేక రకాల వ్యాధులను తగ్గించడం జరుగుతుందని తెలిపారు.ఆయుర్వేద పద్ధతుల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చని, ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా దైనందిన జీవితంలో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు.జిల్లాలో ఆయుష్ వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారని, మధుమేహం,రక్త పోటు,వివిధ రకాల వ్యాధులకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని పూజించే సంస్కృతి బతుకమ్మ పండుగకు తంగేడు పూల కొరత....

## ----తంగెడు పూలపై పుల్కం ప్రశాంత్ స్నేహ బృందం తీసిన వీడియో వైరల్

చొప్పదండి బతుకమ్మ పండుగ సందర్భంగా తంగేడు పూల కొరతపై కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చెర్లపల్లి (ఆర్)కి చెందిన పుల్కం ప్రశాంత్ అనే యువకుడు తన స్నేహ బృందం అసునూరి ప్రవీణ్ ,జింక శ్రావణ్,జగిత్యాలకి చెందిన దైవాల కిషోర్ అనే యువకులు రూపొందించిన వీడియో సామాజిక మాధ్యామాల్లో వైరల్ గా మారింది. ఒకప్పుడు బతుకమ్మ పండుగంటే సంచులు పట్టుకుని తంగెడు పూలు,గునుక పూలు పలు ప్రకృతి ప్రసాదించిన రకరకాల పువ్వులు తీసుకుని రావడానకి యువకులు,మహిళలు, ఆడపడుచులు పోయేవారు. గతంలో ఊరి పొలిమేరల్లో కావాల్సినంత తంగేడు పూలు, మక్క పెరడులలో,సేనులలో కావాల్సినంత గునుగు పూలు పూసేది. పట్టుకుచ్చులు వాకిట్ల, పెరట్లలల్ల విరగబూసేది, ఊరి పొలిమేరలు రియల్ ఎస్టేట్ తో ప్లాట్లుగా మారిపోయినాయి. పెరట్లల్లో కొట్టే గడ్డిమందుకు గునుగు పువ్వు సచ్చిపోయింది, గత సంవత్సరం 100 రూపాయలు ఖర్చు చేసిన పిరికెడు తంగేడు పూలు దొరకలేదు. మహిళలు సాంప్రదాయ బద్దంగా భక్తి శ్రద్ధలతో రోజు ఆడే బతుకమ్మ ఆటలకు, చివరిరోజు జరుపుకునే బతుకమ్మ పండుగకు బతుకమ్మ పేర్చడానికి పువ్వు లేకుండా చేసుకున్న కాలం మనదని 9 వ రోజు బతుకమ్మ వచ్చేసరికి గునుగు, తంగేడు కోసం మనం పడుతున్న కష్టాలని దృష్టిలో ఉంచుకుని మన పెరట్లో పూసిన పువ్వు తెంపుకోవాల్సిన మనం , డబ్బులు పెట్టి కొనుక్కునే రోజులకి వచ్చాం అని,దీంతో మార్కెట్లో ఈ పూల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని పకృతిని కాపాడుకోవాలని కనువిప్పు కలిగించేందుకు స్మగ్లర్ లు వజ్రాలు, బంగారం ఎలా తీసుకోని ఎవరికంట పడకుండా ఇతరులకు ఇచ్చి వ్యాపారం ఎలా చేస్తారో బాలీవుడ్ సినిమా మాదిరిగా ఈ వీడియో తీయడం జరిగిందని నిర్వాహకుడు పుల్కం ప్రశాంత్ పలువురు ఇందులో నటించిన యువకులు తెలిపారు. ఇన్ స్టాగ్రామ్,ఫేస్ బుక్ లో,సోషల్ మీడియా లో, యూ ట్యూబ్ లో ఈ వీడియో గత 4 రోజులుగా చక్కర్లు కొడుతూ ప్రేక్షకులని ఆకట్టుకుంటు చైతన్యాన్ని కలిగిస్తుందని తెలిపారు.

# ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 : జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. ప్రాంతంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 300 కోట్ల రూపాయల వ్యయంతో 650 పడకలతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ఆర్.డి.ఓ.శ్రీనివాస్ రావు తో కలిసి ఆకస్మికంగా సందర్శించి జాతీయ రహదారి 63 నిర్మాణంలో భాగంగా కొనసాగుతున్న పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన అర్హులైన బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారు వచ్చిన పనుల వివరాలను తెలుసుకున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు,ఇతర ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తులను నిబంధనలకు లోబడి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 23:ఆదిలాబాద్ కథోలికా మెత్రాసన మరియు డాన్ బాస్కో ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కార్మెల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పన ఉద్దేశంతో కార్మెల్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ డా ఫాదర్ జేవియర్ రెక్స్, ఫాదర్ జిజో యువత విభాగ డైరెక్టర్, ఫాదర్ సాఫిన్, డాన్ బాస్కో జాబ్ మేళా నిర్వాహన డైరెక్టర్ ఫాదర్ జస్టిన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మెల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కూడా సాంకేతిక కృత్రిమ పరిజ్ఞానంతో నడిపించబడుతున్నదని అన్నారు. ఉద్యోగ అన్వేషణ చేస్తున్న అభ్యర్థులు అందరూ నైపుణ్యాలతో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాకు దాదాపు 400 పైగా అభ్యర్థులు పాల్గొనగా 210 మంది ఎంపిక కాగా 60 మందికి నియామాక పత్రాలు అందజేశారు. ఇందులో ప్రసిద్ధి చెందిన 22 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. యువతి యువకుల భవిష్యత్తును చక్కదిద్దడం కోసం ఇలాంటి ఎన్నో జాబ్ మేళాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆదిలాబాద్ పీఠం యూత్ డైరెక్టర్ ఎఫ్ ఆర్ జిజో, ఫాదర్ జస్టిన్ లు తెలిపారు. ఈ జాబ్ మేళ విజయవంతం కావాడానికి ఎంతోమంది సహకరించగా ప్రత్యేకంగా యూత్ మెంబర్స్ వాలంటీర్లుగా ఎంతో కృషి చేశారన్నారు.




## మంత్రి వివేక్ వెంకటస్వామిని సన్మానించిన మైనార్టీలు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 23:ముస్లిం మైనార్టీల్లో వెనుకబడిన కులాలు ఫకీర్ దూదేకుల కులస్తుల వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రెండు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినందుకు మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ బి1 కార్యాలయంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముస్లిం సబ్ కాస్ట్ బీసీ బీ నూర్ భాషా కులస్తులు సన్మానించారు. గత ప్రభుత్వ పాలనలో అణిచివేత గురి అయిన ముస్లిం నూర్ భాషా ఫకీర్ కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అందులో ఒకటి ఇందిరమ్మ మైనార్టీ మహిళా యువజన వితంతువులు విడాకులు తీసుకున్న వారు అనాధలు అవివాహితులకు ఆర్థిక సహాయం చేపట్టే పథకం రెండవది రేవంతన్న సహారా మిస్కీన్ల కోసం ఫకీర్ కులస్తులు దూదేకుల కులస్తులు వర్గాలకు మోపెడు వాహనాలు ఒక్కొక్కరికి లక్ష రూపాయల గ్రాండ్ గురించి అర్హులైన వారికి ఆన్లైన్లో అప్లికేషన్ పెట్టుకుంటే సంక్షేమ పథకాలు అమలు అమలవుతాయి. ముస్లిం మైనార్టీలో అడుగు స్థాయిలో ఉన్న కులస్తులకు సంక్షేమ పథకాలు పెట్టేందుకు వీలుగా కృషిచేసిన గనుల శాఖ మంత్రి వివేక వెంకటస్వామిని వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ ముస్లిం మైనార్టీ సబ్ కాస్ట్ నూర్ భాషా కులస్తులు కమిటీ మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎం.డి సలావుద్దీన్, ఎండి షరీఫ్, సుకూర్, జమీల్ భాయ్ ఇషాక్, చోటా మియా, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన కంటోన్మెంట్ అధికారులు

సికింద్రాబాద్ రక్షణ శాఖ భూములలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని కంటోన్మెంట్ అధికారులు నేలమట్టం చేసారు. పికెట్ ఎరుకల బస్తీలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసారు. గతంలోనే అక్రమ భవన నిర్మాణానికి నోటీసులు జారీ చేసినట్లు కంటోన్మెంట్ అధికారులు చెబుతున్నారు. పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. మేము 90 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని భవన యజమాని కుటుంబం అంటోంది. మాకు కోర్టుకు పోయే సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 50ఇళ్లు ఎరుకల సామాజిక వర్గం వారు నివాసం ఏర్పరచుకొని ఉంటున్నట్లు బాధితులు చెబుతున్నారు. కావాలని కక్ష్యపూరితంగా తమ ఇంటిని కూల్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## అలరించిన బతుకమ్మ ఆటపాట ఫ్యామిలీ డే వేడుకలు

### ఉత్సాహంగ పాల్గొన్న మహిళలు









**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 23:**మందమర్రి ఏరియాలోని సి.ఈ.ఆర్ క్లబ్ లో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ ఆట పాట (ఫ్యామిలీ డే) వేడుకలు అల్లరించాయి. ఈ కార్యక్రమాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మందమర్రి ఏరియ సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ బతుకమ్మ ఫ్యామిలీ డే ఆట పాట కార్యక్రమానికి సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబీకులకు, అధికారులకు, సింగరేణి కార్మిక సంఘం నాయకులకు, సేవా సమితి సభ్యులకు, మహిళలకు పిల్లలకు, ప్రజలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ మరియు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, మన ప్రియతమ సి అండ్ ఎండీ బలరాం ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డే ఆటపాట వేడుకలను అందరు కుటుంబ సభ్యులు ఒక్క దగ్గర చేరి ఆహ్లాదంగా గడపాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అలాగే ఈ రోజు నిర్వహిస్తున్న ఈ బతుకమ్మ ఆట పాట కార్యక్రమానికి మీరంతా తరలి రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఈ వేడుకలలో భాగంగా బతుకమ్మ ఆట, పాట, డ్యాన్సుల పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఓ.టూ.జి.ఎం విజయ ప్రసాద్ ఏఐటియుసి మందమర్రి జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రమేష్, సీనియర్ పి ఓ శంకర్, అన్ని గనుల ప్రాజెక్ట్ ఆఫీసర్లు,మేనేజర్లు, మరియు సంక్షేమ అధికారులు, సేవ సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం

### తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 23:**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రి బి1 కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం 82 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో అక్రమ కేసులు, అక్రమ అరెస్ట్ లతో కేసీఆర్ రాచరిక పాలన సాగించిండన్నారు. 60 వేల కోట్లు అప్పును 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా కేసీఆర్ మార్చిండని, 8 లక్షల కోట్ల అప్పుకు 5 వేల కోట్ల వడ్డీని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కేసీఆర్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందన్నారు. గత ప్రభుత్వంలో బి.ఆర్.ఎస్ లీడర్ల కే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశానన్నారు. 9 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి సన్న బియ్యానికి పంపిణీ చేస్తున్నామని గత పది యేండ్లలో ఒక్క రేషన్ కార్డు,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 17 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు.



ఈకార్యక్రమంలో తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్, కమిషనర్ తుంగపిండి రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వారాహి మిల్లెట్స్ మార్ట్ ను ప్రారంభించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం)** ఖమ్మం మమత రోడ్డు నందు వజ్రా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో శ్రీ వారాహి మిల్లెట్స్ మార్ట్ ను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్ట్యా వజ్రా ఎలక్ట్రానిక్స్ వారు ప్రజలకు నాణ్యమైన చిరుధాన్యాల అందించడమే లక్ష్యంగా ఈ స్టోర్ ను ఏర్పాటు చేశారని అన్నారు . ఈ స్టోర్లో మిల్లెట్స్ ఇంట్లో ఉండే పిల్లల నుంచి పెద్దలకు ఎంతో ఉపయోగపడే ఆరోగ్యకరమైన చిరుధాన్యాలు ఉంటాయని కావున పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు . చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వీటి వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని సమాజానికి ఆరోగ్య భద్రతతో పాటు రైతుకు ఆర్థిక భద్రత అందించిన వాళ్ళం అవుతామని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమాదేవి సతీష్ ప్రోపరేటర్స్ సముద్రం యల్లేశ్వరరావు నందిగామ వీర బ్రహ్మచారి 39వ డివిజన్ కార్పొరేటర్ మాదూరి ప్రసాద్ ధనాల ప్రసాద్ వీరవెల్లి రాజేష్ గడిల నరేష్ ఆకారపు శ్రీనివాస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు

## చెత్త వేసినచో జరిమానా తప్పదు

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 23** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్.సి.ఐ ప్రాంతంలో చెత్తను వేస్తున్నారని, అటువంటి వారికి భారీ జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి నిత్యం వార్డుకు నిత్యం సూపర్ క్యారీ వ్యాన్లు, ట్రాక్టర్లు, ప్రతి రోజు వార్డులకు వస్తాయని, కానీ ప్రజలు గమనించక రోడ్లపై, ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తూ దోమలు ప్రబలడానికి కారకులు అవుతున్నారని, పర్యావరణాన్ని పాడుచేస్తున్న వారిపై మున్సిపల్ కటినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. మున్సిపాలిటీలో ప్రజలు అందరూ చెత్తను ఆరుబయట పారవేయకుండా మున్సిపల్ వాహనానికి అందిస్తున్నారని, కొంతమంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఎఫ్.సి.ఐ. ప్రాంతంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించి జరిమానా బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సిపాయిలుగా పని చేస్తున్న చెత్తను రోడ్లపై వేయడం వల్ల పర్యావరణం కాలుష్యం అయి, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు గమనించి, చెత్తను మున్సిపల్ వాహనానికి అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్, ఈఈ శ్రీకాంత్, పారిశుద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవస్థానానికి 20 లక్షల మంజూరు

### – ఏళ్లుగా నోచుకోని దేవాలయాలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహర్దశ.

### – కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రణవ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ సభ్యులు.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 23** అభివృద్ధికి నోచుకోని దేవాలయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రథంలో ముందుకు వెళ్తున్నాయని హనుమాన్ దేవస్థాన చైర్మెన్ కొలిపాక శంకర్ అన్నారు.మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి,కమిటీ హాల్ కు 20 లక్షల ఎస్డిఫ్ నిధులు మంజూరు చేశారని నిధులు మంజూరు చేపించడానికి కృషి చేసిన ప్రణవ్ కు,జిల్లా మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. హుజూరాబాద్ నడిబొడ్డున ఉన్న హనుమాన్ దేవస్థానాన్నీ ఏళ్లుగా పాలించిన పాలకులు పట్టించుకునే నాధుడు కరువయ్యాడని ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం రోజున ఇచ్చిన మాట ప్రకారం ప్రణవ్ నిధులు కేటాయించారని,హిందుత్వం అని చెప్పే ఈ ప్రాంత ఎంపీ ఆలయాలకు ఏం నిధులు కేటాయించారో తెలపాలని కోరారు.ప్రజా ప్రభుత్వంలో గుళ్లు, బడులు అభివృద్ధి జరుగుతున్నాయని ఇది శుభపరిణామమని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రణవ్ బాబు చిత్రపటానికి పాలాభిషకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ,మండల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గిడ్డంగుల సంస్థ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న

### రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాబలం)** ఖమ్మం పెద్దతండా లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ నుంచి రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సంస్థ ఉద్యోగుల తో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈసందర్భంగా ఆయన వారికి తగు సూచనలు సలహాలు అందించారు ముందుగా గిడ్డంగుల సంస్థ ఉద్యోగులు అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు గిడ్డంగుల సంస్థ ఉద్యోగులకు బోనస్ ఇస్తామని ఆయన అన్నారు ఇంకో 5000 మీటర్స్ పూర్తి అయితే రాష్ట్ర వ్యాప్తంగా వంద శాతం అక్యుపెన్సీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ సాధించినట్లే అన్నారు.ఇందులో అందరూ బాగా పని చేశారని ఇంకా బాగా పని చేయాలని ఆయన తెలిపారు.అందరూ ఆర్.యం. లు స్టోరేజ్ చార్జెస్ పెండింగ్ త్వరగా వసూలు చేయాలన్నారు.తద్వారా కార్పొరేషన్ ను అభివృద్ధి లో నడిపించాలని చెప్పారు హైదరాబాద్ రీజిన్ లో స్టోరేజ్ చార్జీలు ఎక్కువ పెండింగ్ ఉన్నాయన్నారు.గోడౌన్ లో నిల్వ ఉన్న స్టాకును టైమ్ టు టైమ్ పురుగుల రాకుండా కాపాడాలని పురుగులు లేకుండా పిడిఎస్ పంపాలని ఆయన చెప్పారు అందరం కలిసి పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడదామని ఆయన పిలుపునిచ్చారు

## బీజేపీ ఎస్టీ మోర్చా ర్యాలీ

నాచారం బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రవి నాయక్ బాధ్యతలు స్వీకరిస్తున్న నేపథ్యంలో నాచారం నుండి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు రవి నాయక్ బీజేపీ నేతలు భారీ ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. నాచారం హనుమాన్ దేవాలయం లో పూజలు నిర్వహించిన అనంతరం బారి ర్యాలీగా బయలు దేరారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన రామచంద్రరావు కు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి లతో పాటు, బిజెపి రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ లో 18 సంవత్సరాలు గా పని చేస్తున్న నా సేవలను గుర్తించి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గిరిజనుల అభివృద్ధి కి ఎల్లపుడు కృషి చేస్తానని, గిరిజనలకు ఎలాంటి అన్యాయం జరిగిన ముందుండి పోరాడతానని రవి నాయక్ హామీ ఇచ్చారు...

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com